

12న జిల్లాకు రానున్న మంత్రి నాదెండ్ల 6

» కలెక్టరేట్‌లో ఐదు జిల్లాల అధికారులతో సమీక్ష

» ఖరీఫ్‌లో ధాన్యం సేకరణ కార్యాచరణపై సమావేశం

ఏపీఈఏపీసెట్ మూడో విడత కౌన్సెలింగ్ ప్రారంభం 6

నేటి నుంచి కాకినాడలో యోగా శిక్షణ

» ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏడు రోజులు తరగుతులు

కాకినాడ-రాజమహేంద్రవరం 6 ప్రత్యేక రైలు

పిల్లల అక్రమ దత్తత నేరం

» డీసీపీయూ 1098 నెంబర్‌కి కాల్ చేసి సమాచారం ఇవ్వండి

» ఐసీడీఎస్ పీడీ లక్ష్మి

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా బాలల పరిరక్షణ విభాగానికి(డీసీపీయూ) చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కి ఎక్కువగా పిల్లల అక్రమ అమ్మకాలు, దత్తతలపై ఫిర్యాదులు వస్తున్నాయని జిల్లా మహిళా అభివృద్ధి, శిశుసంక్షేమశాఖ పీడీ లక్ష్మి పేర్కొన్నారు. చట్టప్రకారం అక్రమ దత్తత నేరమని, పిల్లలు లేని తల్లిదండ్రులు www.cara.wcd.gov.in లేదా కాకినాడ ప్రతాప్‌నగర్‌లోని జిల్లా శిశు గృహ(దత్తత ఏజెన్సీ) ద్వారా మాత్రమే చట్టబద్ధమైన ఆ ప్రక్రియను చేపట్టాలని సూచించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో పాల్గొన్న వారిపై బాలల న్యాయ చట్టం-2015 సెక్షన్ 80/81 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫిర్యాదు చేసిన వారి సమాచారం గోప్యంగా ఉంటుందని తెలిపారు. మరింత సమాచారం కోసం చైల్డ్ హెల్ప్‌లైన్-1098 పోలీస్ టోల్-112 నెంబర్లకు కాల్ చేయవచ్చన్నారు.

యూరియా కోసం తప్పని కష్టాలు



జిల్లాలో రైతులకు యూరియా కోసం కష్టాలు తప్పడంలేదు. సహకార సొసైటీల వద్ద, ఎరువుల దుకాణాల వద్ద ఇలా వరుసల్లో నిలబడాల్సి వస్తోంది.

గొల్లప్రోలులో యూరియా కోసం బారులు తీరిన రైతులు

కొద్దిరోజులు.. ఆగుదాం!



» వాహనాలపై జీఎస్టీ తగ్గింపు ఫలితం

» నిలిచిన కార్లు, ద్విచక్ర, త్రిచక్ర వాహనాల కొనుగోళ్లు

» ముందస్తు బుకింగ్‌లు

» 22 నుంచి కొనేందుకు ఏర్పాట్లు

» విజయదశమికి భారీగా అమ్మకాలు జరిగే అవకాశం

వాహనాలపై జీఎస్టీ తగ్గిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయంతో కొనుగోళ్లు నిలిచిపోయాయి. ఇక కొద్ది రోజులే కదా వేచి చూద్దాం అనే ధోరణి, ఆపై విజయదశమి దగ్గరగా ఉండడంతో అప్పుడు కొందామనే ఆలోచనతో అందరూ బ్రేక్ ఇచ్చేశారు. ఫలితంగా కేంద్రం ప్రకటన వచ్చిన నాటి నుంచి కార్లు, ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు దాదాపుగా నిలిచిపోయి షోరూంల్లో సందడి కనిపించడం లేదు. ఈ సమయంలోనే పలు వాహన కంపెనీలు ఆఫర్లపై ఆఫర్లు ప్రకటిస్తూ వినియోగదారులను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి.

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

జీఎస్టీ సంస్కరణల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రకటనతో అన్ని రకాల వాహనాల ధరలు తగ్గనున్నాయి. జీఎస్టీ తగ్గింపు నిర్ణయం ఈనెల 22వ తేదీ నుంచి అమలుల్లోకి రానున్న నేపథ్యంలో ప్రస్తుతం వాహనాల కొనుగోలు చేయాలని భావించిన వారంతా తమ నిర్ణయాలను వాయిదా వేసుకున్నారు. ఇప్పటికే అన్ని రకాల కార్లు, ద్విచక్ర వాహనాల ధరలను తగ్గిస్తున్నట్టు కంపెనీలు ప్రకటించాయి. ఒకటి రెండు కార్ల కంపెనీలు పోటీకి తెరలేపుతూ జీఎస్టీ తగ్గింపును ముందస్తుగానే వినియోగదారులకు వర్తింపజేస్తామంటూ ప్రకటనలు ఇస్తూ ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇక ద్విచక్ర వాహనాలతోపాటు కార్లు, ఎస్‌యూవీలు ఇతర వాహనాలపై విధించే జీఎస్టీని తగ్గిస్తున్నట్టు కేంద్రం ప్రకటించింది. ఇందులో భాగంగా 350 సీసీ, అంతకంటే తక్కువ కెపాసిటీ కలిగిన ద్విచక్ర వాహనాలపై ప్రస్తుతం ఉన్న 28 శాతం జీఎస్టీని 18 శాతానికి తగ్గించారు. దీంతో వాహనాల ధరలు రూ.8 వేల నుంచి రూ.23 వేల వరకూ తగ్గే అవకాశం ఉంది. అలాగే 1200 సీసీ అంతకంటే తక్కువ సామర్థ్యం కలిగిన పెట్రోల్, పెట్రోల్ హైబ్రిడ్, ఎల్పీజీ, సీఎన్‌జీ కార్లు, 1500 సీసీలోపు ఉన్న డీజిల్, డీజిల్ హైబ్రిడ్ కార్లపై ఇప్పటివరకూ 28 శాతం జీఎస్టీ ఉండగా దానిని 18 శాతానికి తగ్గించారు. ఇదే రీతిలో మధ్యశ్రేణి, ఉన్నతశ్రేణి ఎస్‌యూవీలపై ఇప్పటివరకూ జీఎస్టీ 28 శాతం, సెస్‌లతో కలుపుకుని 45 నుంచి 50 శాతం వరకూ పన్నులు చెల్లించాల్సి వచ్చేది. జీఎస్టీని 28 నుంచి 40 శాతానికి పెంచారు. సెస్‌లను మినహాయించారు. దీంతో పన్నులు 5-10 శాతం వరకూ తగ్గనున్నాయి. ఈ నేపథ్యంలో కార్ల ధరలు కనిష్ఠంగా రూ.30 వేల నుంచి గరిష్ఠంగా రూ.4.50 లక్షల వరకూ తగ్గనున్నాయి. ఇదే విషయాన్ని తెలుపుతూ మారుతి సుజుకి, టాటా మోటార్స్, హ్యుందయ్, ఎంజీ, కియా, హోండా తదితర కార్ల కంపెనీలు ఇప్పటికే అధికారికంగా ప్రకటనలు కూడా విడుదల చేశాయి.

అమ్మకాలకు బ్రేక్

కేంద్రం జీఎస్టీ పన్నుల శ్లాబుల్లో మార్పులు చేస్తుందనే సమాచారం వచ్చిన నాటి నుంచి వాహనాలు కొనుగోళ్లు మందగించాయి. అధికారిక ప్రకటన వచ్చిన తర్వాత దాదాపుగా అమ్మకాలు నిలిచిపోయాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా గల కార్లు, ద్విచక్రవాహనాల షోరూంల్లో కొద్ది రోజులుగా కొనుగోళ్లు జరగడం లేదు. ఈనెల 21వ తేదీ వరకూ ఇదే పరిస్థితి కొనసాగనున్నది. 22వ తేదీ నుంచి జీఎస్టీ తగ్గింపు అమల్లోకి వస్తున్న నేపథ్యంలో ఆ తర్వాతే కొనుగోళ్లు జరపాలని వినియోగదారులు భావిస్తుండడమే ఇందుకు కారణంగా చెబుతున్నారు. సాధారణంగా కాకినాడ జిల్లాలో ప్రతి నెలా సగటున 2 వేల నుంచి 3 వేల వరకూ ద్విచక్ర వాహనాలు, 300-450 వరకూ కార్లు విక్రయాలు జరుగుతాయి. తూర్పుగోదావరి జిల్లాలో 2,200 నుంచి 2,800 వరకూ ద్విచక్ర వాహనాలు, 300-500 వరకూ కార్లు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ప్రతి నెలా 1800 నుంచి 2,500 వరకూ ద్విచక్ర వాహనాలు, 300నుంచి 500 వరకూ కార్లు విక్రయాలు జరుగుతాయి. విజయదశమి, దీపావళి, సంక్రాంతి, ఉగాది తదితర పండుగల సమయాల్లో వీటి విక్రయాలు రెట్టింపుపైగా ఉంటాయి.

ముందస్తు బుకింగ్‌లపై దృష్టి

ఇప్పుడు ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు, కార్ల కంపెనీలతోపాటు షోరూంల నిర్వాహకులు కొనుగోలుకు ఆసక్తి చూపించే వారి వద్ద నుంచి ముందస్తు బుకింగ్‌లు కోసం ప్రయత్నిస్తున్నాయి. ఇందుకోసం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలు షోరూంలు ఆఫర్లు ప్రకటించాయి. తమ వద్ద కొనుగోలు చేసే వారికి యాక్సిసరీలు ఉచితంగా ఇస్తామంటూ ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఒకటి రెండు కార్ల కంపెనీలు తమ కార్లు ఇప్పుడు కొనుగోలు చేసినా జీఎస్టీ తగ్గింపు వర్తింపజేస్తామంటూ ప్రకటనలు జారీ చేశాయి. సాధ్యమైనంత వరకూ ఎక్కువమందికి తమ వాహనాలు విక్రయించేందుకు సంప్రదింపులు చేస్తున్నారు.

విజయదశమికి ఫుల్‌జోష్

ఈసారి విజయదశమికి వాహనాల కొనుగోళ్లు అధికంగా ఉంటాయని భావిస్తున్నారు. గతంతో పోల్చుకుంటే ఇప్పుడు అమ్మకాలు 100 శాతంపైగా పెరుగుతాయని చెబుతున్నారు. ఎప్పటి నుంచో బైక్‌లు, కార్లు కొనుగోలు చేయాలని భావించేవారు ఈనెల 22వ తేదీ నుంచి తగ్గను న్న ధరలతో కొనేందుకు మొగ్గు చూపే అవ కాశం ఉంది. విజయదశమి పర్వదినాన వాహనాలు కొనుగోలు చేస్తే కలిసి వస్తుందనే నమ్మకంగా ఎక్కువమంది ఆ రోజున వాహనాలు కొనుగోలు చేస్తూ ఉంటారు. ఈ సెంటిమెంట్, ధరల తగ్గడం అమ్మకాలు పెరిగేందుకు దోహదం చేస్తాయని వాహన షోరూంల ప్రతినిధులు చెప్పారు. ఇప్పటికే పలువురు వాహనాల ధరలు ఏ మేర తగ్గాయి, ఎటువంటి ఆఫర్లు ప్రకటించారు తదితర విషయాలను ఆరా తీస్తున్నారని వారు తెలిపారు. మార్కెట్‌లో పోటీ తట్టుకునేందుకు ఆఫర్లు ప్రకటించక తప్పదని వారు చెబుతున్నారు. మరోవైపు వాహనాలు కొనుగోలు చేయాలని భావిస్తున్న వారు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రేట్లు ఎక్కడ తక్కువగా ఉన్నాయి, ఏయే ఆఫర్లు ఇస్తున్నారు తెలుసుకుని మరీ కొనాలని భావిస్తుండడం విశేషం. జీఎస్టీ తగ్గింపు వల్ల భవిష్యత్తులో విక్రయాలు పెరిగే అవకాశమున్నా ప్రస్తుతం మాత్రం నిలిచిపోయాయి.



రూ. లక్ష.. దాటేసి..

10 గ్రా.బంగారం 22 క్యారెట్ రూ.1,01,100.. జనవరిలో రూ.71,500

కిలో వెండి ధర రూ.లక్షా 28 వేల 900.. జనవరి నాటి ధర రూ.88,400

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

బంగారం ధరలు మిడిసి పడుతున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి బాగా పెరుగుదల మొదలైంది. ఇక తగ్గేదేలే అన్నట్టు ముందుకు పోతోంది. అపుడప్పుడు అటూఇటూ వెనకడుగు వేసినట్టు కనిపించినా, మళ్లీ పరుగుపెడుతోంది. జనవరి నుంచి ఇప్పటికి సుమారు ఎనిమిది నెలల కాలంలో 22 క్యారెట్ బంగారం ధర ఏకంగా రూ.30 వేలు అదనంగా పెరిగింది. 24 క్యారెట్ బంగారం 10 గ్రాముల ధర సుమారు 33 వేల వరకూ పెరుగుదల కనిపిస్తోంది. వెండి ధర కూడా విపరీతంగా పెరిగింది. వెండి ధర సుమారు 40 వేల వరకూ పెరిగిపోయింది. మంగళవారం రాజమండ్రి మార్కెట్‌లో బంగా బంగారం 22 క్యారెట్ 10 గ్రాములు ధర రూ.లక్ష దాటేయడం గమనార్హం. 24 క్యారెట్ బంగారం ధర ఎపుడో రూ.లక్ష దాటేసిన సంగతి తెలిసిందే. ఎక్కువ మంది 22 క్యారెట్ బంగారమే కొంటారు. వస్తువులు కూడా ఇవే ఉంటాయి. ఇవాళ 10 గ్రాముల 22 క్యారెట్ బంగారం రూ.1,01,100 కి చేరింది. అంటే కేవలం ఒక గ్రాము బంగారం 10వేల110 కావడం గమనార్హం. సామాన్యుడు చిన్న బంగారం వస్తువును కూడా కొనుగోలు చేసుకునే పరిస్థితి లేనట్టే. 10 గ్రాముల 24 క్యారెట్ ధర రూ.1,10,290 చేరింది. ఇదంతా రికార్డు స్థాయి ధరలు. ప్రజలకు అందుబాటు కాని ధరలు. పేద, మధ్యతరగతి ప్రజలు బంగారం అంటే కలలోనే చూసే వస్తువుగా మారిపోయింది. ఇంతవరకూ బంగారం కొనుగోలు చేసిన వారి పంట బాగా పండినట్టే. జనవరికి ముందుకు కొనుగోలు చేసినవారికే బాగా మిగిలినట్టే చెప్పవచ్చు. బ్యాంకుల్లో రుణాలు కూడా అధికంగా బాగా వస్తాయి.

● వెండిదీ అదే బాట

ప్రస్తుతం రాజమహేంద్రవరం మార్కెట్ కిలో వెండి ధర రూ.1 లక్షా 28వేల 900గా ఉంది. ఇది ఇలా ఎంత ధరకు పెరిగిపోతుందో చెప్పలేం. ఒకవేళ తగ్గితే వందో రెండొందలో తగ్గుతోంది. పెరిగితే వేలల్లో పెరిగిపోతోందని వినియోగదారులు వాపోతున్నారు. జనవరి 1న వెండి ధర కిలో 88,400గా ఉండగా ఆ తర్వాత ధర భారీగా పెరిగిపోయింది. జనవరి నుంచి ఇప్పటివరకూ వెండి ఏకంగా రూ.40,500 పెరిగింది. డబ్బున్నవారు బంగారం, వెండి కొనడానికి వెనకాడకపోయినా, సామాన్యులు మాత్రం కళ్లు తేలేస్తున్నారు.

జిల్లాకు 500 మెట్రిక్ టన్నుల యూరియా

» విశాఖపట్నం పోర్టునుంచి కాకినాడకు రాక

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాకు తాజాగా మంగళవారం రాష్ట్రప్రభుత్వం మరో 500 మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించింది. ఈ స్టాక్ విశాఖపట్నం పోర్టునుంచి రోడ్డుమార్గంలో లారీల ద్వారా వస్తోంది. ఈస్టాక్ గురువారానికల్లా కాకినాడకు చేరుకుంటుంది. అనంతరం టోకెన్ల సిస్టమ్ ద్వారా రైతులకు పారదర్శకంగా యూరియా పంపిణీ చేసేందుకు వ్యవసాయశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 11న జిల్లాకు మరో 1200 మెట్రిక్‌టన్నుల యూరియాను ప్రభుత్వం కేటాయించనుంది. ఈమేరకు యూరియా కావాలని అధికారులు అమరావతికి ప్రతిపాదనలు పంపారు.

వినియోగంపై రైతులకు అవగాహన

యూరియా వినియోగంపై గత రెండు రోజుల్లో వ్యవసాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా 431 అవగాహన సదస్సులు నిర్వహించి 17,700మంది రైతులకు అవగాహన కల్పించారు. యూరియాను మితంగా వినియోగించడంవల్ల పంటలకు రక్షణ లభిస్తుందన్నారు. మోతాదుకు మించి యూరియా వినియోగిస్తే భూసారం దెబ్బతిని తెగుళ్లు సోకుతాయని రైతులకు అవగాహన కల్పించారు. తెగుళ్ల సోకడంవల్ల పంటలకు పెట్టుబడి పెరుగుతుందని జిల్లా వ్యవసాయశాఖ జేడీ తెలిపారు.

ఎరువుల దుకాణాలపై కొనసాగుతున్న దాడులు

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ బృందాల దాడులు కొనసాగుతున్నాయి. మంగళవారం యు.కొత్తపల్లి మండలంలో రెండు దుకాణాలను తనిఖీ చేశాయి. ఇక్కడ స్టాక్‌లో ఎలాంటి వ్యత్యాసాలు కనిపించలేదు. మొత్తంగా జిల్లాలో ఇప్పటివరకు 8దుకాణాలపై 6ఏ కేసులు నమోదు చేయగా 202 మెట్రిక్ టన్నుల ఎరువులను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.45లక్షలుగా గుర్తించారు.

యూరియా సరఫరాపై రైతులు ఆందోళన చెందొద్దు

» ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): యూరియా సరఫరా నిమిత్తం రైతులు ఎవరూ అనవసరంగా ఆందోళన చెందాల్సిన పని లేదని ఎస్పీ జి.బిందుమాధవ్ భరోసాఇచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదలచేశారు. ఈఏడాది ప్రారంభంలో జిల్లా వ్యాప్తంగా యూరియా నిల్వలు 9,890 మెట్రిక్ టన్నులు ఉండగా 11,069 మెట్రిక్ టన్నులు దిగుమతి చేసుకోగా మొత్తం 20,959 మెట్రిక్ టన్నులు నిల్వఉన్నాయన్నారు. 18,670 మెట్రిక్ టన్నులు విక్రయించగా ఈనెల 9వతేదీ నాటికి 2,610 మెట్రిక్ టన్నులు యూరియా ప్రారంభ నిల్వలు ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. యూరియాకి సంబంధించి ఇప్పటివరకు ఏ పోలీసు కేసు నమోదు కాలేదన్నారు. కొంతమంది యూరియాను అక్రమ నిల్వలు ఉంచిన నేపథ్యంలో విజిలెన్స్‌శాఖ చర్యలు చేపట్టి ఇప్పటివరకు 8 కేసులు నమోదు చేసిందన్నారు. ముఖ్యంగా యూరియా సరఫరాలో అక్రమాలు జరుగుతుంటే రైతులు లేదా ప్రజలు సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు లేదా విజిలెన్స్‌శాఖకు సమాచారం అందించాలన్నారు. యూరియా సరఫరా గురించి రైతులు ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. వారి అవసరాలకు తగినట్లు టోకెన్ విధానంద్వారా సరఫరా కొనసాగుతుందన్నారు. అర్హత ప్రకారం ప్రతి రైతుకు సరైన పరిమాణంలో యూరియా అందించేందుకు చర్యలు తీసుకుంటారని స్పష్టంచేశారు. అనధికారికంగా యూరియాను నిల్వ చేసినా, అక్రమ రవాణాకు పాల్పడినా, సామాజిక మాధ్యమాల్లో అవాస్తవ ప్రచారం చేసినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అన్నియూరియా డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో టోకెన్ సిస్టం అమలు చేసి నిఘా పెంచామన్నారు. రైతుల హక్కులు, ప్రయోజనాలను కాపాడేందుకు జిల్లా పోలీస్‌శాఖ నిరంతరం శ్రమిస్తుందన్నారు. అధికారిక మార్గాలద్వారా యూరియా సరఫరా సక్రమంగా జరుగుతుందని ఎస్పీ వెల్లడించారు.

570 మెట్రిక్ టన్నుల.. యూరియా పంపిణీ పూర్తి

» జిల్లా వ్యవసాయాధికారి

సామర్లకోట, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని మండలాల్లో మంగళవారం 570 మెట్రిక్‌టన్నుల మేర యూరియా ఎరువులను రైతులకు ఆయా పీఏసీఎస్ సొసైటీల ద్వారా సరఫరా పూర్తి చేశామని జిల్లా వ్యవసాయాధికారి ఎన్.విజయ్ కుమార్ వెల్లడించారు. జేసీ రాహుల్‌మీనాతో కలిసి సామర్లకోట, పెద్దాపురం, పిఠాపురం, యూ.కొత్తపల్లి మండలాల్లో మంగళవారం పర్యటిస్తూ సామర్లకోటలో విలేఖరులతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం మరో 500 మెట్రిక్ టన్నుల యూరియాను విశాఖనుంచి రోడ్డు మార్గాన కాకినాడ జిల్లాకు దిగుమతులు చేసేలా ఆదేశించిందని, మరో రెండురోజుల్లో ఆ ఎరువులు రైతులకు అందుబాటులో ఉండగలవని చెప్పారు. యూరియా అధికంగా వాడితే పంటలు బాగా పండుతాయని రైతులు భావిస్తూ అదనంగా ఎరువులు వాడుతున్నారని, ఇది ఎంతమాత్రం పంటకు మంచిది కాదని స్పష్టం చేశారు. చీడపీడలు అధికంగా ఆశించే ప్రమాదం పొంచిఉన్నందున ఆయా మండల వ్యవసాయాధికారుల సిఫార్సుల మేరకే యూరియా ఎరువులను వినియోగించాలన్నారు. ఎరువుల వినియోగంపై జిల్లావ్యాప్తంగా రైతులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని అన్ని మండల వ్యవసాయాధికారులను ఆదేశించగా మంగళవారం సాయంత్రం వరకూ 217 గ్రామాల్లో సదస్సులు నిర్వహించి 9,200 మంది రైతులను చైతన్యవంతులను చేశామని జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాకినాడ ఏడీఏ దుర్గాలక్ష్మి పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు

» అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యూరియా కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ప్రధాని మోదీ సుపరిపాలన 11ఏళ్ల సందర్భంగా కాకినాడలో మంగళవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది సకాలంలో వర్షాలు పడడంతో సాగువిస్తీర్ణం బాగా పెరిగిందన్నారు. యూరియా కొరతఉన్నా రైతులకు ఇబ్బందులు లేకుండా అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. సీఎం స్వయంగా యూరియాపై ప్రతిరోజూ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నారన్నారు. అయినా ప్రతిపక్షమైన వైసీపీ యూరియా ఇవ్వడం లేదని ధర్నాలు చేయడం సరికాదన్నారు. జీఎస్టీ సంస్కరణలో రూ.48వేల కోట్లు ఆదాయం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోల్పోతున్నా ప్రజలపై భారం పడుతుందనే ఉద్దేశ్యంతో జీఎస్టీ శ్లాబు రేట్లు తగ్గించారన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ప్రధాని మోదీ పుట్టినరోజు సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో సేవా పక్షోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. బీజేపీ నాయకులు పెద్దిరెడ్డి రవికిరణ్, యార్లగడ్డ రామ్‌కుమార్, మాలకొండయ్య, సాలగ్రామ లక్ష్మీప్రసన్న పైడా భవనప్రసాద్ పాల్గొన్నారు.

అమలాపురంలో.. వాతావరణశాఖ కార్యాలయం

» కోస్తా తీరంలో ఎప్పటికప్పుడు సమాచారం

అమలాపురం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేసేందుకు వీలుగా భారత వాతావరణశాఖ(ఐఎండీ) కార్యాలయాన్ని జిల్లా కేంద్రమైన అమలాపురం సమీపంలోని భట్నవిల్లి వద్ద ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలోభాగంగా ఆగ్రామంలో ప్రసిద్ధఅమ్మవారైన వనువులమ్మ దేవాలయానికి సంబంధించిన 50సెంట్ల భూమిని కూడా వాతావరణశాఖ కార్యక్రమాన్ని నెలకొల్పేందుకు గుర్తించారు. బంగాళాఖాతం సముద్రతీరం అత్యధికంగా ఉన్న డాక్టర్‌బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో తరచూ సంభవించే ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఎప్పటికప్పుడు వాతావరణంలో సంభవించే మార్పులను ప్రజలకు తెలియచేసే లక్ష్యంతో ఈ కార్యాలయం పనిచేయనుంది. కేంద్రప్రభుత్వ అధీనంలో ఏర్పాటు చేసే ఈ కార్యాలయానికి సంబంధించి భారత వాతావరణశాఖ అధికారుల బృందం క్షేత్రస్థాయిలో మంగళవారం పరిశీలన చేసింది. భట్నవిల్లిలో వనువులమ్మ ఆలయ భూములను పరిశీలించి అక్కడ ఏర్పాటుకు అంగీకారం తెలిపారు. భారీవర్షాలు, సముద్రంలో అలజడులు వంటి వాటిపై సమగ్రసమాచారాన్ని తీరప్రాంత ప్రజలకు చేరవేయనున్నారు. త్వరలోనే కార్యాలయ ఏర్పాటుకు ఏర్పాట్లను ప్రభుత్వం చేపట్టనుంది.

ఎంతో ఉపయోగం: కలెక్టర్

వాతావరణశాఖ అధికారుల బృందం మంగళవారం కలెక్టర్‌తో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ 50సెంట్ల భూమి అనువుగా ఉందని, ఐఎండీ అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. ఈ కేంద్రం ద్వారా ముందస్తు హెచ్చరికలవల్ల బహుళ ప్రయోజనాలు ఉంటాయని, ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజల ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవించకుండా ముందస్తు అప్రమత్తతకు అవకాశం ఉంటుందని అన్నారు. రోజువారీగా వాతావరణ మార్పులపైనా వారపు, దీర్ఘకాలిక సూచనలు అందిస్తాయన్నారు. వేగవంతమైన గాలులు, విజుబులిటీ,మేఘాలు ఏ ఎత్తులో ప్రయాణిస్తున్నాయో తెలియడంతోపాటు విమాన ప్రయాణానికి భద్రతను మరింత మెరుగుపరుస్తుందని, ముఖ్యంగా ఈ కేంద్రం తీర ప్రాంతంలో ఉంటే మత్స్యకార గ్రామలకు ఉపయోగం ఉంటుందని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఐఎండీశాఖ ప్రతినిధి విఠల్, శాస్త్రవేత్తలతోపాటు అమలాపురం తహశీల్దార్ అశోక్‌ప్రసాద్ పాల్గొన్నారు.

హౌసింగ్ పీడీకి పదోన్నతి


కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా గృహనిర్మాణశాఖ పీడీ సత్యనారాయణకు పదోన్నతి లభించింది. స్పెషల్ ప్రమోషన్ పోస్ట్ స్కేల్‌తో డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ రెవెన్యూశాఖ ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఆయన హౌసింగ్ పీడీగా కొనసాగనున్నారు. ఆయనకు పలువురు అభినందనలు తెలియజేశారు.

జిల్లా ఉద్యానవనశాఖ అధికారిగా సిరిల్

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి):కాకినాడ నగరపాలక సంస్థ హార్టీకల్చర్ ఏడీ సిరిల్ జిల్లా ఉద్యానవనశాఖ అధికారిగా పదోన్నతి పొందారు. ఈ మేరకు మంగళవారం అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

జనంలేక వెలవెలబోయిన వైసీపీ పోరుబాట

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వైసీపీ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన అన్నదాత పోరుబాట జనం లేక వెలవెలబోయింది. ఉదయం 10 గంటలకు నిరసన కార్యక్రమానికి హాజరుకావాలని పార్టీశ్రేణులను, రైతులను కోరినా 11గంటలైనా ఆశించినస్థాయిలో ఎవరూ రాకపోవడంతో కార్యక్రమం నీరసంగా సాగింది. కాకినాడ ఆర్డీవో కార్యాలయంవద్ద జరిగిన నిరసన కార్యక్రమానికి మాజీమంత్రి కురసాల కన్నబాబు వ్యక్తిగత కారణాలతో హాజరు కాలేకపోయారు. వైసీపీకి చెందిన మరికొంతమంది పార్టీ నాయకులు కూడా దూరంగా ఉన్నారు. దీంతో రాష్ట్రంలో రైతన్నకు సకాలంలో ఎరువులు సరఫరా చేయడం లేదనే ఆరోపణలతో చేసిన అన్నదాత పోరుబాటకు స్పందన కరవైనట్లయింది. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీ వంగా గీత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు ఎరువులు సరఫరా చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని ధ్వజమెత్తారు.



సద్గురు జగ్గీవాసుదేవ్ సమక్షంలో

నేటి నుంచి కాకినాడ గాంధీభవన్‌లో

యోగా శిక్షణ

ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏడు రోజులు తరగతులు

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రామకృష్ణారావుపేటలోని గాంధీభవన్‌లో బుధవారం నుంచి ఈ నెల 16వ తేదీ వరకు ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. ప్రాచీన యోగశాస్త్రాల ప్రకారం ఇన్నర్ ఇంజనీరింగ్ మానవుని సంపూర్ణ శ్రేయస్సుకు బాటలు వేస్తోందని వారు పేర్కొన్నారు. ప్రతిరోజూ ఉదయం 6 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు రెండు సెషన్లుగా శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. బుధవారం ఉదయం 6 నుంచి 7 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు ఉచిత పరిచయ కార్యక్రమం ఉంటుందన్నారు. దీనికి ఎవరైనా హాజరు కావచ్చన్నారు. మరిన్ని వివరాలకు 96181 18529, 6301756244 నెంబర్లను సంప్రదించాలన్నారు.

కాకినాడ జీజీహెచ్‌కు రూ.23 కోట్ల నిధులు

జీజీహెచ్ (కాకినాడ), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) కాకినాడ జీజీహెచ్‌లో బయో మెడికల్ పరికరాలు, ఫర్నిచర్ కొనుగోలుకు నిధులు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు వైద్య-ఆరోగ్య శాఖ జీవో ఆర్టీ నెం.583 విడుదల చేసింది. కాకినాడ, గుంటూరు జీజీహెచ్‌లకు కలిపి బయోమెడికల్ ఎక్విప్‌మెంట్, ఫర్నీచర్‌లకు రూ.51కోట్లు నిధులు విడుదల చేసింది. ఇందులో రూ.23 కోట్ల వరకు కాకినాడ జీజీహెచ్‌కు వచ్చే అవకాశం ఉంది.

ఇక 'స్పీడ్'గా...

- రిజిస్టర్ పోస్టు సేవలకు విరామం
- వచ్చే నెల ఒకటో తేదీ నుంచి స్పీడ్ పోస్టులో విలీనం
- తపాలా శాఖలో కీలక పరిణామం

EMS SPEEDPOST

भारतीय डाक Indian Post

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

తంతి తపాలా... ఉత్తరప్రత్యుత్తర సేవలలో ఏళ్ల తరబడి ప్రజలతో విడదీయరాని బంధాన్ని కొనసాగిస్తున్న సంస్థ. మెయిల్స్, మొబైల్స్, ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి రాని రోజుల్లో మారుమూల ప్రాంతాల్లో ఉన్న వారికి సైతం సమాచారాన్ని చేరవేసే ఏకైక సమాచార వ్యవస్థ ఈ తంతి తపాలాయే. టెలిగ్రామ్, మనియార్డర్... ఇలా పలు రకాల సేవలతో ప్రజలకు చేరువైన ఈ సంస్థ కాలానుగుణంగా మారుతూ వస్తోంది. ప్రైవేటు సంస్థలకు దీటుగా సమాచార సేవ కొనసాగిస్తోంది. పౌర, బ్యాంకింగ్ సేవలను సైతం అందిస్తోంది. కీలకమైన పలు మార్పులు ఈ శాఖలో చోటుచేసుకుంటున్నాయి. దీంట్లో భాగంగా బ్రిటిష్ కాలం నాటిదైన రిజిస్టర్ పోస్టును స్పీడ్ పోస్టు విభాగంలో విలీనం చేయాలని భారత తపాలా శాఖ నిర్ణయించింది. తొలుత సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి దీనిని అమలు చేస్తామని చెప్పింది. అయితే వివిధ కారణాలతో అక్టోబరు ఒకటో తేదీ నుంచి ఇకపై పోస్టల్ శాఖలో రిజిస్టర్ పోస్టు కనుమరుగు కానుంది.

అప్పట్లో అట్లుండేది..

పోస్టల్ శాఖలో రిజిస్టర్ పోస్టుది ఎంతో ఘన చరిత్ర ఉంది. ఈ సేవలను అప్పటి బ్రిటిష్ చక్రవర్తి లార్డ్ డల్‌హౌసీ ప్రవేశపెట్టారు. అప్పటి ఇండియన్ పోస్టాఫీస్ చట్టంతో రిజిస్టర్ పోస్టు సేవలు మొదలయ్యాయి. అంతకు ముందు 1766లో వారెన్ హేస్టింగ్ ఈస్టిండియా కంపెనీ ఆధ్వర్యంలో 'కంపెనీ మెయిల్' ప్రారంభమైంది. దాదాపు 171 సంవత్సరాల పాటు రిజిస్టర్ పోస్టు సేవలందించింది. ముఖ్యమైన పత్రాలను, వస్తువులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చింది. ముఖ్యంగా లీగల్ నోటీసులు, అపాయింట్‌మెంట్ లెటర్లు, బ్యాంకింగ్ సంబంధిత పత్రాలు వంటివాటిని పంపడానికి ఇది ఎంతగానో ఉపయోగపడింది. పంపించిన వస్తువు. పత్రం అవతలివారికి చేరినట్టు రసీదు పొందడం దీని ప్రత్యేకత.

వేగవంతమైన డెలివరీకి ప్రాధాన్యం..

పోస్టల్ సేవల ఆధునికీకరణలో భాగంగా తపాలా శాఖ రిజిస్టర్ పోస్టు విలీనంపై నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. దేశీయ పోస్టల్ సేవలను క్రమబద్ధీకరించడం, పనితీరు మెరుగుపరచుకోవడం, ట్రాకింగ్ వ్యవస్థను బలోపేతం చేయడం వంటివి విలీన ప్రక్రియకు కారణంగా తెలుస్తోంది. స్పీడ్ పోస్టు అనేది వేగవంతమైన డెలివరీకి ప్రాధాన్యమిస్తోంది. ఇప్పుడు రిజిస్టర్ పోస్టుల సేవలు స్పీడ్‌పోస్టులో విలీనమైతే డెలివరీలు మరింత వేగవంతమవుతాయి. ముఖ్యంగా స్పీడ్ పోస్టు ద్వారా మీ పార్సిల్ ఎక్కడికి వెళ్లిందో ఆన్‌లైన్‌లో చెక్ చేసుకునే సౌకర్యం సైతం ఉంటుంది. ఈ ఆప్షన్ రిజిస్టర్ పోస్టులో లేదు. అలాగే ఒకే సేవ ఉండడం వల్ల పోస్టల్ సేవలు మరింత సులువు అవుతాయి. సిబ్బందిపై పనిభారం కూడా తగ్గుతుంది. అయితే ప్రభుత్వ శాఖలే ఎక్కువగా రిజిస్టర్ పోస్టు సేవలను వినియోగించుకునేవి. అన్నిరకాల ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ రిజిస్టర్ పోస్టు ద్వారా చేసేవి. అందుకే ముందుగా పోస్టల్ శాఖ ప్రభుత్వ శాఖలకు ఈ విషయంపై సమాచారం అందించింది.

స్పీడ్ పోస్టు ధర తగ్గించాలి...

రిజిస్టర్ పోస్టును నిలిపివేస్తుండడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. స్పీడ్ పోస్టులో విలీనం చేస్తే రుసుం పెరుగుతుందని, అదనపు భారం తప్పదని భావిస్తున్నారు. రిజిస్టర్ పోస్టు చార్జీ రూ.26 ఉంటే, స్పీడ్ పోస్టు చార్జీ రూ.41 వరకు ఉంటుందంటున్నారు.

12న కాకినాడ రానున్న మంత్రి నాదెండ్ల

- కాకినాడ కలెక్టరేట్లో ఐదు జిల్లాల అధికారులతో సమీక్ష
- ఖరీఫ్‌లో ధాన్యం సేకరణ కార్యాచరణపై సమావేశం



కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈనెల 12వ తేదీన కాకినాడ జిల్లాకు రానున్నారు. కాకినాడ కలెక్టరేట్లో ఆ రోజు ఉదయం 10 గంటలకు ఐదు జిల్లాల జాయింట్ కలెక్టర్లు, సివిల్ సప్లయిస్ అధికారులు, రైస్‌మిల్లర్లు, వ్యవసాయ, సహకార శాఖల అధికారులతో ఆయన సమావేశమవుతారు. ఉమ్మడి తూర్పు గోదావరిలోని మూడు జిల్లాలతో పాటు ఉమ్మడి పశ్చిమ గోదావరిలోని రెండు జిల్లాల్లో ఖరీఫ్ ధాన్యం సేకరణ కార్యాచరణపై మంత్రి నాదెండ్ల అధికారులతో ప్రత్యేకంగా సమీక్షిస్తారు. కాకినాడ జిల్లాలో గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 1.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. గత ఏడాది రబీ సీజన్‌లో 1.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అధికారులు సేకరించారు. ఈ నేపథ్యంలో ఈఏడాది ఖరీఫ్ సీజన్‌లో 277 రైతు సేవా కేంద్రాల ద్వారా పెద్ద ఎత్తున ధాన్యం సేకరించేందుకు అధికారులు కార్యాచరణ రూపకల్పన చేస్తున్నారు. ఖరీఫ్ ధాన్యం సేకరణపై ఇప్పటికే కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు దేవుల నాయక్ ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. మంత్రి నాదెండ్లతో వీరు ప్రత్యేకంగా సమీక్షించనున్నారు. సివిల్ సప్లయిస్ కమిషనర్ సౌరబ్‌గౌర్, కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్‌తో, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారు.



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న సీనియర్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ అనురాధ

కీటక జనిత వ్యాధుల నివారణపై శిక్షణ

జీజీహెచ్(కాకినాడ) సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) నేషనల్ వెక్టర్ బోర్న్ డిసీజ్ కంట్రోల్ ప్రోగ్రాం (ఎన్‌వీబీడీసీపీ) కీటక జనిత వ్యాధుల నివారణపై కాకినాడ డీఎంహెచ్‌వో కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఒకరోజు శిక్షణ జరిగింది. ట్రాన్స్‌మిషన్ అసెస్‌మెంట్ సర్వే (టీఏఎస్-2) ఈ నెల 12 నుంచి 16 వరకు జరగనున్న నేపథ్యంలో సీనియర్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.అనురాధ ఆధ్వర్యంలో వర్క్‌షాపు నిర్వహించారు. టీఏఎస్-2లో భాగంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో 1, 2 తరగతుల పిల్లలకు ఫైలేరియా స్క్రీనింగ్ నిమిత్తం రక్త పరీక్షలు నిర్వహించడంపై రాష్ట్ర, జిల్లా అధికారులు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. డీఎల్‌ఏటీవో డాక్టర్ పి.ప్రభాకర్, జిల్లా మలేరియా అధికారి పి.విల్సన్, కోనసీమ జిల్లా డీఎంవో ఎన్.వెంకటేశ్వరరావు, ఎం.పార్వతీశం, ఎం.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఈఏపీసెట్ మూడో విడత కౌన్సెలింగ్ ప్రారంభం

- కాకినాడ ఆంధ్రా పాలిటెక్నిక్‌లో సహాయ కేంద్రం ఏర్పాటు
- రేపటి వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం

కాకినాడ రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలల్లోమొదటి, రెండు విడతల్లో భర్తీకాని సీట్లలో ప్రవేశాల కోసం ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. దీంతో ఏపీ ఈఏపీసెట్ మూడో విడత కౌన్సెలింగ్ మంగళవారం ప్రారంభమైంది. విద్యార్థులకు ఈ నెల 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. 12 వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు. 13న వెబ్ ఆప్షన్లు మార్పుచేసుకునేందుకు గడువునిచ్చింది. 15న విద్యార్థులకు సీట్లు కేటాయిస్తారు. 17లోపు విద్యార్థులు కళాశాలల్లో రిపోర్టు చేయాలి. 15వ తేదీ నుంచి తరగతులకు హాజరుకావాలి.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కాకినాడ జగన్నాథపురంలోని ఆంధ్రా పాలిటెక్నిక్ (ఏపీటీ) కళాశాలలో సహాయ కేంద్రం ఏర్పాటు చేశామని సమన్వయకర్త, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.జనార్దనరావు తెలిపారు. తొలిరోజు 20మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకుని ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేశారు. విద్యార్థులకు ఏమైనా సందేహాలుంటే సహాయ కేంద్రంలో గానీ, 99123 42010 నెంబరును గానీ సంప్రదించాలని ఆయన సూచించారు.

రేపటి నుంచి అండర్-14, 17 బాలబాలికలకు క్రీడా పోటీలు

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య అండర్-14, 17 బాలబాలికలకు ఈ నెల 11వ తేదీ నుంచి క్రీడా పోటీలు జరుగుతాయని నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11న కాకినాడ డీఎస్‌ఏ మైదానంలో అండర్-14, 17 ఆర్చరీ, సపక్‌తక్రా, అండర్-17 ఘట్కా, 15న అండర్-14, 17 విభాగాల్లో సాఫ్ట్ టెన్నిస్, జూడో, షూటింగ్, ఫుట్‌బాల్ (అండర్-17), ఈ నెల 16న టెన్నిస్ (అండర్-14, 17), వెయిట్ లిఫ్టింగ్ (అండర్-17), జిమ్నాస్టిక్స్ (అండర్-14, 17, 19), 17న అండర్-14, 17 విభాగాల్లో టేబుల్ టెన్నిస్, రగ్బీ, కాకినాడ పీఆర్ హైస్కూల్లో నెట్‌బాల్, ఈ నెల 18న కాకినాడ డీఎస్‌ఏ మైదానంలో అండర్-14, 17 విభాగాల్లో స్విమ్మింగ్ అండ్ డైవింగ్, రెజ్లింగ్, ఫ్రీస్టైల్ అండ్ గ్రీకో రోమన్, స్క్వాష్, ఈ నెల 19న డీఎస్‌ఏలో మోడరన్ పెంటాథ్లాన్, (అండర్-17), అండర్-14, 17ల్లో సైక్లింగ్, కాకినాడ రాజాటాంక్ స్కేటింగ్ రింక్‌లో స్కేటింగ్, ఎన్టీఆర్ బీచ్‌లో బీచ్ వాలీబాల్ పోటీలు జరుగుతాయి.

కళాశాలలకు ఫిజికల్ డైరెక్టర్లు తప్పనిసరి

- యూనివర్సిటీ సమావేశాలకు గైర్హాజరయ్యే కాలేజీలపై చర్యలు
- నన్నయ వర్సిటీ వీసీ ప్రసన్నశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అన్ని అనుబంధ కళాశాలల్లో ఫిజికల్ డైరెక్టర్‌లు తప్పనిసరిగా ఉండాలని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ స్పష్టంచేశారు. అలాగే వర్సిటీ నిర్వహించే సమావేశాలకు గైర్హాజరైన కళాశాలలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విశ్వవిద్యాలయంలో మంగళవారం జరిగిన వర్సిటీ క్రీడాబోర్డ్ సాధారణ సమావేశంలో ఆమె మాట్లాడుతూ పీడీలు లేని కళాశాలలపై చర్యలు తీసుకుంటామన్నారు. వర్సిటీ పరిధిలో సుమారు 400 అనుబంధ కళాశాలలు ఉండగా వాటిలో ఎక్కువ కళాశాలలకు పీడీలు లేకపోవడం దురదృష్టకరమన్నారు. నేటి ప్రపంచంలో శారీరక వ్యాయామం లేక ఎక్కువ మంది విద్యార్థులు స్థూలకాయంతో అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం చూపే ఆటలకు ప్రాధాన్యమివ్వాలని స్పష్టం చేశారు. తాము విశ్వవిద్యాలయం నుంచి ఆకస్మిక తనిఖీలు చేపట్టి పీడీలు లేని కళాశాలలపై చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే 2024-25 విద్యాసంవత్సరంలో కళాశాలల వారీ సాధించిన పతకాలు, క్రీడాకారుల వివరాలను ప్రస్తావించి అభినందించారు. ప్రస్తుతం 47 రకాల పురుషుల, స్త్రీల అంతర్ కళాశాలల టోర్నమెంట్‌లు, విశ్వవిద్యాలయం జట్టు ఎంపికలు, ఈవెంట్స్ నిర్వహించే పీడీలు వర్సిటీ ప్రతిష్టను దృష్టిలో ఉంచుకొని టోర్నమెంట్‌లు నిర్వహించాలన్నారు. ఆలిండియా, సౌత్‌జోన్ పోటీల్లో ఎక్కువ పతకాలు సాధించిన కళాశాలకు రూ.10 వేలు నగదు బహుమతితోబాటు పీడీకి గౌరవ పురస్కారాలు అందిస్తామన్నారు. అకడమిక్ కరిక్యులమ్‌కు ఇబ్బంది లేకుండా త్వరలో క్రీడా క్యాలెండర్ సిద్ధం చేయాలన్నారు. క్రీడాబోర్డు కార్యదర్శి ఆచార్య కేవీ స్వామి 2025-26 సీజన్‌లో అంతర్ కళాశాలలు, అంతర్ విశ్వవిద్యాలయాల జట్టు ఎంపికల నిర్వహణపై పీడీలతో చర్చించారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ తరపున వీసీని సన్మానించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే, సీడీసీ డీన్ ఎ.మట్టారెడ్డి, విశ్వవిద్యాలయ వ్యాయామ విద్య అధ్యాపకులు, పీడీలు, అనుబంధ కళాశాలల పీడీలు పాల్గొన్నారు.

అరుణాచలం, రామేశ్వరం

పుణ్యక్షేత్రాల యాత్ర

30 మంది భక్తులతో బయలుదేరి వెళ్లిన ఆర్టీసీ బస్సు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అరుణాచలం, రామేశ్వరం యాత్రకు మంగళవారం సాయంత్రం రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో నుంచి 30 మంది భక్తులతో స్టార్‌లైనర్ నాన్ ఏసీ స్లీపర్ బస్సు బయలుదేరి వెళ్లిందని డిపో మేనేజర్ కె.మాధవ్ తెలిపారు. ఈ యాత్రలో 9 రోజులపాటు కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, పళని, కోయంబత్తూర్, కుంభకోణం, చిదంబరం, గురువాయూర్, త్రివేంద్రం, కన్యాకుమారి, మధురై, రామేశ్వరం, శ్రీరంగం, తంజావూరు, తదితర 14 పుణ్యక్షేత్రాలను దర్శించుకుని తిరిగి 18వ తేదీన రాజమహేంద్రవరం డిపోకు చేరుకుంటుందని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ట్రాఫిక్ ఎం.అజయ్‌బాబు, అసిస్టెంట్ ఇంజనీర్ ఎస్.నాగలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో మెరుగైన వైద్యసేవలందించాలి

- వైద్యారోగ్య శాఖ ఆర్‌డీ పద్మాశశిధర్
- నర్సులుగా నియామకం పొందిన వారికి జాయినింగ్ ఉత్తర్వులు



స్టాఫ్‌నర్సుగా నియామకపత్రాన్ని అందజేస్తున్న పద్మాశశిధర్

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో స్టాఫ్‌నర్సులుగా నియామకం పొందిన వారు గ్రామాల్లోని పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ప్రాంతీయ వైద్య, ఆరోగ్య సంచాలకులు జోన్-2 డాక్టర్ పి.పద్మాశశిధర్ అన్నారు. మంగళవారం రాజమహేంద్రవరంలోని ఆర్‌డీ కార్యాలయంలో కాంట్రాక్టు ప్రాతిపదికన స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి సంబంధించి తుది మెరిట్ జాబితాలో నిలిచిన అభ్యర్థులకు సర్టిఫికెట్ల పరిశీలన చేశారు. డిప్యూటీ డైరెక్టర్ ఎల్.శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఆఫీసు సూపరింటెండెంట్లు పి.శ్రీనివాసులు, ఎండీ ఉస్మాన్, కె.రామచంద్రరావు, సీనియర్ అసిస్టెంట్లు ఏఎస్ మూర్తి, ఎంఏ జాఫర్ ఈ ప్రక్రియ నిర్వహించారు. అనంతరం ఖాళీలకు కౌన్సెలింగ్ నిర్వహించి మొత్తం 53 మందికి పద్మా శశిధర్ చేతులమీదుగా ఉద్యోగ నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్‌డీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య సేవలు, పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాఫీ తోటల్లో తెగుళ్లపై అధికారులు అప్రమత్తం



కాఫీ తోటలను పరిశీలిస్తున్న అధికారులు

మారేడుమిల్లి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లాలో పలు చోట్ల కాఫీ తోటల్లో కాయతొలుచు పురుగు వల్ల తెగుళ్ల ఏర్పడడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాలతో ఎంపీడీవో శ్రీనివాస్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో ఉద్యానవన, వ్యవసాయశాఖల అధికారులు బృందంగా ఏర్పడి మారేడుమిల్లి, చట్లవాడ పంచాయతీలో పర్యటించారు. కాఫీ తోటల్లో కాయ తొలుచు పురుగు క్షుణ్ణంగా పరిశీలించారు. మండల పరిధిలో 78 హెక్టార్లలో 11 బ్లాకులుగా ఈ కాఫీ తోటలు విస్తరించి ఉన్న ప్లాంటేషన్‌ను క్షుణ్ణంగా పరిశీలించి కాయ తొలుచు పురుగు ఆనవాళ్లు లేవని నిర్ధారించారు. దీనిపై పూర్తిస్థాయి నివేదికను కలెక్టర్ కార్యాలయానికి అందించనున్నామని అధికారులు తెలిపారు. ఈ పరిశీలనలో ఉద్యానవన శాఖ మండలాధికారి కె.ముత్తయ్య, వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, అగ్రికల్చర్ సహాయకులు రవి, తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం ఛాంబర్ అధ్యక్షుడిగా కనికిరెడ్డి



ఛాంబర్ అధ్యక్షుడిగా ఎన్నికైన కనికిరెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

రావులపాలెం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాజపురస్కార అవార్డు గ్రహీత పోతంశెట్టి కనికిరెడ్డి రావులపాలెం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రావులపాలెంలోని ఛాంబర్ కామర్స్ భవనంలో పూర్వ అధ్యక్షుడు కర్రి నాగిరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.గౌరవ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, అధ్యక్షుడిగా పోతంశెట్టి కనికిరెడ్డి, సెక్రటరీగా ఎం.సూరిబాబు, ట్రెజరర్‌గా మండవల్లి మహేష్, వైస్ ప్రెసిడెంట్స్‌గా కర్రి శ్రీనివాసరెడ్డి, మామిడిశెట్టి సోమరాజు, ఆకుల శివ, జాయింట్ సెక్రటరీలుగా కొవ్వూరి వంశీకృష్ణారెడ్డి, నీలకంఠం, మన్యం ప్రసాద్, జాయింట్ ట్రెజరర్‌గా కడించర్ల నాగరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా కనికిరెడ్డి మాట్లాడుతూ వ్యాపారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామన్నారు. నిలిచిపోయిన ఛాంబర్ భవనాన్ని అధునాతనంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తానన్నారు. వ్యాపారుల వల్ల వినియోగదారులకు, వినియోగదారుల వల్ల వ్యాపారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సమావేశాల్లో చర్చించి కార్యచరణ రూపొందించి దానికి అనుగుణంగా వ్యవహరిస్తామని పేర్కొన్నారు.

టీటీడీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం



టీటీడీ చైర్మన్‌కు చెక్కు అందజేస్తున్న దాత చిరంజీవి

తిరుమల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): టీటీడీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా అందింది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన చిరంజీవి విరాళం చెక్‌ను తిరుమలలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.2 లక్షల విరాళం




ఏఈవోకు విరాళం అందజేస్తున్న దాత

అన్నవరం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో ప్రతి ష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి మంగళవారం విశాఖపట్నానికి చెందిన చింతల అప్పలనాయుడు రూ.2 లక్షలు విరాళంగా సమర్పించారు. ఆలయ విభాగ ఏఈవో భాస్కర్‌కు అందజేయగా దాతను ఆయన అభినందించి వారికి స్వామివారి ప్రసాదం,ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు.

కాకినాడ-రాజమహేంద్రవరం ప్రత్యేక రైలు

15 నుంచి ప్రారంభం



సామర్లకోట, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): కాకినాడపోర్టు-రాజమహేంద్రవరం మధ్య ప్రత్యేక రైలును ఈ నెల 15 నుంచి ప్రారంభించనున్నట్టు రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ మంగళవారం రాత్రి ప్రత్యేక ఆదేశాల జారీ చేశారు. ఈ మేరకు సామర్లకోట రైల్వే ఉన్నతాధికారులకు అందిన సమాచారం ఇలా ఉంది. ఈ రెండు పట్టణాల మధ్య ప్రయాణీకుల అవసరాలు తీర్చేందుకు స్వల్ప టిక్కెట్ ధరలతో బాటు సమయం ఆదా అయ్యే విధంగా ఈ ప్రత్యేక రైలు ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీపీఆర్వో శ్రీధర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

07523 నెంబరు గల కాకినాడ పోర్టు నుంచి రాజమహేంద్రవరం మధ్య ప్రయాణించే ప్రత్యేక రైలు ఈనెల 15 నుంచి ఉదయం 6.15గంటలకు బయలుదేరుతుంది. కాకినాడ టౌన్‌కు 6.23గంటలకు, సామర్లకోటకు 6.38 గంటలకు, జి.మేడపాడుకు 6.43గంటలకు, బిక్కవోలుకు 6.48గంటలకు, అనపర్తికి 6.53గంటలకు, ద్వారపూడికి 6.58గంటలకు, రాజమహేంద్ర వరానికి 8.15 గంటలకు చేరుతుంది.

07524 నెంబరు గల రాజమహేంద్రవరం నుంచి కాకినాడ పోర్టు మధ్య ప్రయాణించే ప్రత్యేక రైలు ఈ నెల 16 నుంచి 3.00గంటలకు బయలుదేరుతుంది. ద్వారపూడికు 3.13గంటలకు, అనపర్తికు 3.18గంటలకు, బిక్కవోలుకు 3.23గంటలకు, జీ.మేడపాడుకు 3.28గంటలకు, సామర్లకోటకు 3.43గంటలకు, కాకినాడ టౌన్‌కు 4.08గంటలకు, కాకినాడ పోర్టుకు 4.40గంటలకు చేరుతుంది. ఈ ప్రత్యేక రైళ్ల రాకపోకలు తిరిగి ప్రకటించే ఇవే సమయాలు అమలులో ఉంటాయని, ఈ రైళ్ల ప్రయాణ సమయం రెండు గంటలు మాత్రమే అయినందున గ్రామీణ ప్రాంతాల ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సీపీఆర్వో శ్రీధర్ పేర్కొన్నారు.

వైసీపీ కులాల మధ్య అల్లర్లు సృష్టించాలని చూస్తోంది

కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్

అమరావతి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కులాల మధ్య అల్లర్లు సృష్టించాలని వైసీపీ చూస్తోందని రాష్ట్ర కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ మండిపడ్డారు. వైసీపీ గాలిమాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని కోరారు. మంగళవారం అమరావతి సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ ప్రతిపక్షం కాదని విషవృక్షమని మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా పని చేసిన చిర్ల జగ్గిరెడ్డిలో అవగాహన లోపం ఉందనేది ఆయన మాటలతీరుతో అర్థమవుతోందన్నారు. శెట్టిబలిజల గురించి మాట్లాడే హక్కు వైసీపీకి లేదన్నారు. బీసీల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలన్న కృత నిశ్చయంతో ప్రభుత్వం ఉందన్నారు. స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించిన వైసీపీ ఇప్పుడు బీసీల పట్ల మొసలి కన్నీరు కారుస్తోందన్నారు. బీసీలకు అగ్రతాంబూలం ఇచ్చిన పార్టీ టీడీపీ అని బార్లు, వైన్ షాపుల్లో శెట్టిబలిజలకు అవకాశం కల్పించిందన్నారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ కావడంతో దిమ్మతిరిగి వైసీపీ నేతలు అవాకులు చవాకులు మాట్లాడుతున్నారని మంత్రి సుభాష్ మండిపడ్డారు.

రాష్ట్రంలో యూరియా కొరత ఉందనడం పూర్తిగా అవాస్తవమని మంత్రి అన్నారు. కేవలం రైతులను భయాందోళనకు గురి చేసి రాజకీయ లబ్ధి పొందాలనే దురుద్దేశంతోనే వైసీపీ విషప్రచారం చేస్తోందన్నారు. జగన్ రెడ్డి తన ఐదేళ్ల పాలనలో ఏటా సగటున 5 లక్షల టన్నుల యూరియా మాత్రమే రైతులకు అందించారని, కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ ఖరీఫ్ సీజన్‌లో 7 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను అందుబాటులోకి తెచ్చిందని, మరో 40 వేల మెట్రిక్ టన్నులు ఈ నెల 10వ తేదీలోగా రైతులకు చేరనుందని చెప్పారు.

అయినవిల్లి ఆదాయం రూ.66.68 లక్షలు

శ్రీసిద్ధివినాయక ఆలయంలో కానుకల లెక్కింపు


హుండీల్లో కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

అయినవిల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయంలోని హుండీల్లో కానుకలను మంగళవారం లెక్కించారు. వినాయక చవితి మహోత్సవాలు ఆగస్టు 27 నుంచి ఈనెల 4 వరకు నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన సుమారు లక్షా 50వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్సవాల సందర్భంగా వివిధ టిక్కెట్ల అమ్మకాల ద్వారా రూ.43,58,204 ఆదాయం వచ్చింది. ప్రత్యేక అభిషేకాలు 2737, టిక్కెట్ల ద్వారా రూ.6.84లక్షలు, హుండీల ఆదాయం రూ.15,75,149, ఉత్సవ పందిరి హుండీ రూ.28, 133, అన్నదానం హుండీ రూ.22, 521 ఆదాయం రాగా మొత్తం ఉత్సవాల ఆదాయం రూ.66, 68,225 వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనర్ అల్లు దుర్గాభవానీ తెలిపారు. గతేడాది ఉత్సవాల ఆదాయం రూ.51, 51,788 వచ్చిందని చెప్పారు.

తాగిన మైకంలో తాచుపాముతో చెలగాటం

- కాటేసినా పట్టించుకోకుండా మెడలో వేసుకుని హల్‌చల్
- భయభ్రాంతులకు గురైన స్థానికులు


పామును మెడలో వేసుకున్న వెంకటేశ్వరరావు

ముమ్మిడివరం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తాగిన మైకంలో ఓ వ్యక్తి తాచుపాముతో చెలగాటమాడి ప్రాణాలపైకి తెచ్చుకున్నాడు. ఈ సంఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం కమిని పంచాయతీ పరిధిలోని పొట్టితిప్పలో మంగళవారం జరిగింది. పొట్టితిప్పకు చెందిన గొల్లపల్లి వెంకటేశ్వరరావు అలియాస్ కొండ మంగళవారం తాగిన మైకంలో కోడిగుడ్ల కోసం కోళ్లకు ఉంచిన గంప దగ్గరికి వెళ్లి చేయి పెట్టగా గంప కింద ఉన్న తాచుపాము కాటేసింది. అప్పటికే పూర్తిగా మద్యం మత్తులో ఉన్న వెంకటేశ్వరరావు ఆ పామును పట్టుకుని నన్నే కరుస్తావా అంటూ మెడలో వేసుకుని హల్‌చల్ చేశాడు. దీంతో స్థానికులు భయ భ్రాంతులకు గురై పామును వదిలేయమని వెంకటేశ్వరరావును హెచ్చరించినా లెక్క చేయకుండా పామును మీ పైకి వదులుతానని దానితో చెలగాటమాడిన క్రమంలో మరోసారి ఆ పాము వెంకటేశ్వరరావును కాటేసింది. స్థానికులు మూకుమ్మడిగా వెంకటేశ్వరరావు నుంచి పాము వేరు చేసి దాన్ని హతమార్చి చికిత్స కోసం వెంకటేశ్వరరావును ఐ.పోలవరం మండలం టి.కొత్తపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అత్యవసర వైద్యసేవల నిమిత్తం వెంకటేశ్వరరావును అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


స్థానికుల చేతిలో హతమైన తాచుపాము


అంబులెన్సులో వెంకటేశ్వరరావు

వాటర్ ప్లాంట్‌లో క్లోరిన్ గ్యాస్ లీక్

- యానాంలో సంఘటన
- 200 మీటర్ల వరకు వ్యాప్తి
- 15 మందికి అస్వస్థత
- ఆసుపత్రికి తరలింపు



క్లోరిన్ గ్యాస్ లీకైన ట్యాంక్, వాటర్ స్ప్రే చేస్తున్న దృశ్యం

యానాం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): యానాం శివారు కనకాలపేటలో ప్రజాపనుల శాఖ ద్వారా పరిసరర ప్రాంత ప్రజలకు తాగునీటిని శుద్ధి చేసి సరఫరా చేసే వాటర్ ప్లాంట్‌లో మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా క్లోరిన్ గ్యాస్ ట్యాంక్ లీకైంది. దీంతో అధికారులు, సిబ్బంది భయభ్రాంతులకు గురయ్యారు. అక్కడే ఉన్న అధికారులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. విషయం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది సంఘటనప్రాంతానికి చేరుకుని క్లోరిన్ లీకైన ప్రాంతంలో వాటర్ స్ప్రే చేయడంతో వారిలో కొంతమంది తీవ్ర అస్వస్థతకు గురై పడిపోయారు. 200 మీటర్ల వరకు క్లోరిన్ వ్యాప్తి చెందడంతో అందరూ మాస్కులు ధరించారు. అక్కడే ఉన్న ప్రజాపనులశాఖ ఈఈ నాగరాజు, జేఈలు సంతోష్, బోద్దు ప్రసాద్‌తో పాటు ఫైర్‌సిబ్బంది అస్వస్థతకు గురికావడంతో ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఆర్‌ఏ అంకిత్‌కుమార్, ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించి అక్కడ పరిస్థితిపై సమీక్షించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. తక్షణం కనకాలపేటలో వైద్యసిబ్బంది, అంబులెన్సు సర్వీసలను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా సమీప ప్రాంతంలో ఉన్నవారు వికారం, వాంతులు, తల తిరగడం, ఊరిరి పీల్చుకునేందుకు ఇబ్బందులు పడ్డారు. ఇది కేవలం సిబ్బంది నిర్లక్ష్యంతోనే జరిగినట్టు తెలిసింది. క్లోరిన్ గ్యాస్ అయిపోయిందా లేదా అనేది పరిశీలించేందుకు తెరవడంతో దాంట్లో ఉన్న క్లోరిన్ ఒక్కసారిగా వ్యాప్తి చెందడంతోనే ఈ సంఘటన జరిగినట్టు తెలిసింది. ప్రస్తుతం అధికారులు, సిబ్బంది, స్థానికులు 15మంది వరకు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రజలెవ్వరూ ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే, ఆర్‌ఏ తెలిపారు. పుదుచ్చేరిలో ఉన్న ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు గ్యాస్ లీకేజీ సంఘటనకు సంబంధించి పుదుచ్చేరి ప్రజాపనులశాఖ ఎస్ఈ వీరసేల్వతో చర్చించారు. యానాం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని వీడియోకాల్‌లో పరామర్శించారు. అలాగే బాధితులను ఎన్ఆర్ కాంగ్రెస్ యానాం శాఖ అధ్యక్షుడు మల్లాడి సామ్యూల్, వ్యాపార వేత్త తోట రాజు పరామర్శించారు.


గ్యాస్ లీక్ కారణంగా సమీపంలో మాడిపోయిన చెట్లు

ఏలేరు జలాశయంలో పెరుగుతున్న నీటి నిల్వలు

ఏలేశ్వరం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు పెరుగుతున్నాయి. మెస్తారు వర్షాలు కురవడంతో వరదనీరు, గోదావరి జలాలు విడుదల చేస్తుండడంతో రిజర్వాయర్‌లోని నీరు పెరుగుతోంది. దీంతో ప్రాజెక్టులో నీటి నిల్వలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం నుంచి గోదావరి జలాలు 1225 క్యూసెక్కులు ఏలేరు జలాశయానికి విడుదలవుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని రీతిలో ప్రాజెక్టులో 86.56 మీటర్ల స్థాయిలో 24.11 టీఎంసీల నీటిని నిల్వ చేసే అవకాశం ఉంది. 81.59 మీటర్ల స్థాయిలో 15.33 టీఎంసీలు నిల్వలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఎడమ కాలువ నుంచి విశాఖపట్నంకి 175 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్టు తెలిపారు.


ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు

బస్సు ఢీకొని యువకుడి మృతి


సూరిబాబు మృతదేహం వద్ద స్థానికులు

గండేపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మల్లేపల్లికి యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మల్లేపల్లికి చెందిన మదపాటి సూరిబాబు (35)రోజువారి పని నిమిత్తం వెళ్లి తాళ్లూరు-బొర్రంపాలెం మధ్య పక్కన నిలబడి ఉండగా నేషనల్ హైవేపై ప్రైవేటు ట్రావెల్ బస్సు ఢీకొనడంతో అక్కడక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు ఎస్సై శివనాగబాబు చెప్పారు.

ద్విచక్రవాహనం ఢీకొని..


మృతిచెందిన రాము

చింతూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన సవలం రాము (35) మృతిచెందాడు. చింతూరు మండలం గొర్రెలగూడెం సమీపంలో 30 నెంబరు జాతీయ రహదారిపై మంగళవారం రాము భద్రాచలం వైపు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో రాము అక్కడికక్కడే మృతిచెందాడు. ఎదురుగా ద్విచక్రవాహనంపై వస్తున్న వ్యక్తుల్లో ఒకరిది చింతూరు మండలం బలిమెల కాగా మరొకరిది మారేడుమిల్లి మండలం పెద్దమల్లంపాడుగా చింతూరు పోలీసులు గుర్తించారు.

మోటారుసైకిల్ ఢీకొని...


వెంకాయమ్మ (ఫైల్)

పెరవలి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా తణుకు జాతీయ రహదారిపై కడింపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోనసీమ జిల్లా రావులపాలెం మండలం రావులపాడుకు చెందిన కొప్పిశెట్టి వెంకాయమ్మ (68) మంగళవారం ఉదయం తన బంధువుల ఇంటికి వెళ్లేటప్పుడు పెరవలి మండలం కడింపాడు సెంటర్ వద్ద ఆటోలో వచ్చి దిగింది. రోడ్డు దాటుతుండగా మోటారుసైకిల్ ఆమెను బలంగా ఢీకొంది. తీవ్ర గాయం కాగా తణుకు ఆసుపత్రిలో చేర్చారు. మెరుగైన వైద్యం కోసం వేరే ఆసుపత్రికి తరలించగా ఆమె మరణించింది. ఆమె కుమారుడు కొప్పిశెట్టి వీరభద్రం ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.

లారీ ఢీకొని ముగ్గురికి తీవ్రగాయాలు

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గొల్లప్రోలు శివాలయ మాన్యం కాలనీకి చెందిన సేటిపల్లి సాయి కుమార్ బంధువులైన ఇద్దరు పిల్లలు కుంపట్ల శర్మిల క్రాంతి, నరసింహమూర్తితో కలిసి మోటార్‌సైకిల్‌పై గొల్లప్రోలు నుంచి తాటిపర్తి వెళ్లాడు. తాటిపర్తిలో ముందుగా వెళ్తున్న లారీ నిర్లక్ష్యంగా అతివేగంతో తిప్పడంతో మోటార్‌సైకిల్‌ను ఢీకొంది. ముగ్గురికి గాయాలు కాగా పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్‌ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టిప్పరు ఢీకొని ఇద్దరికి గాయాలు

శంఖవరం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం నుంచి కొంతంగి కొత్తూరు వెళ్తున్న ఆటోను రౌతులపూడి వైపు వెళ్తున్న టిప్పరు ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. కొంతంగి కొత్తూరుకి చెందిన కర్రి రాజబాబు, కర్రి గోవిందు శంఖవరంలో పని ముగించుకుని తిరిగి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు.


సంఘటనా స్థలంలో క్షతగాత్రులు

కానిస్టేబుల్, హోంగార్డులపై దాడి..
ముగ్గురి యువకుల అరెస్ట్


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ భవ్యకిషోర్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో కానిస్టేబుల్, హోంగార్డులపై దాడికి పాల్పడిన ముగ్గురు యువకులను అరెస్ట్ చేసినట్టు సౌత్‌జోన్ డీఎస్పీ ఎస్.భవ్యకిషోర్ మంగళవారం తెలిపారు. వివరాల ప్రకారం.. ఆదివారం అర్ధరాత్రి కోటిపల్లి బస్టాండ్ వెనుక సోనోవిజన్ షోరూం దగ్గర రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాతతుంగపాడుకు చెందిన పాత రౌడీషీటర్ కట్టుంగ హరీష్, రాజమహేంద్రవరం రూరల్ మండలం రాజవోలు అభ్యుదయ కాలనీకి చెందిన కర్రి దుర్గసూర్యప్రసన్నకుమార్, సంజీవయ్య కాలనీకి చెందిన ములపర్తి వినోద్ మద్యం మత్తులో గొడవపడుతున్నారు. ఆ సమయంలో నైట్ బీట్‌లో ఉన్న కానిస్టేబుల్ యు.నాగబాబు, హోంగార్డు కాశీ వారిని అదుపుచేయడానికి ప్రయత్నించగా వారిపైనే దాడి చేసిగా యపరిచారు. ఈ ఘటనకు సంబంధించి టుటౌన్ సీఐ టీఎస్‌వీఎస్ శ్యాం సుందర్ సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ముగ్గురిని సోమవారం రాత్రి ఈస్ట్ రైల్వేస్టేషన్ రోడ్డులో అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. కేసు న మోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్టు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ టీఎస్‌వీఎస్ శ్యాంసుందర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు భయపడొద్దు

- అల్లూరి జిల్లా కలెక్టర్
- లబ్బర్తి, లాగరాయి, కింద్ర గ్రామాల్లో పర్యటన


ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

రాజవొమ్మంగి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజలు భయపడొద్దని అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలంలోని లబ్బర్తి, లాగరాయి, కింద్ర గ్రామాల్లో ప్రజలు 3 నెలలుగా అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే. దీనిపై మంగళవారం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆ గ్రామాల్లో పర్యటించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలు విన్నారు. 3 గ్రామాల్లో నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపులను పరిశీలించారు. లాగరాయి ప్రభుత్వాసుపత్రిని తనిఖీ చేశారు. అనంతరం విలేకర్లతో కలెక్టర్ మాట్లాడుతూ వార్తా కథనాలు చూసి వచ్చానని, ఇప్పటికే ఇక్కడ ఏడీఎంహెచ్‌వో డేవిడ్ గ్రామాల్లో తనిఖీలు చేపట్టి 3 బృందాలను ఏర్పాటు చేశారని తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్యం లోపించినట్టు గుర్తించి సిబ్బందిని హెచ్చరించామన్నారు. గతంలో 15మంది బ్లడ్ శాంపిల్స్ తీసుకుని పరీక్షలు చేయగా వారిలో ఇద్దరికి చికెన్ గున్యా పాజిటివ్ వచ్చిందని, ప్రస్తుతం ప్రజలకు వైరల్ ఫీవర్ మాత్రమే ఉన్నప్పటికీ లక్షణాలు మాత్రం చికెన్ గున్యావి ఉన్నాయని, అయితే పరీక్షల్లో మాత్రం నెగిటివ్ వస్తున్నాయన్నారు. అన్నిరకాల మందులు స్థానిక పీహెచ్‌సీలో అందుబాటులో ఉన్నాయని, ప్రజల ఆరోగ్యంపై అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఈ గ్రామాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతీ ఇంటిలో దోమలు నివారించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కిర్రాబు ఆనకట్ట నిర్మించాలని, జీవో నెంబర్ 3ని పునరుద్ధరించాలని ఆదివాసీ నాయకులు కలెక్టర్‌ను కోరారు. సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేడ్కర్, డీఎంహెచ్‌వో విశ్వేశ్వరనాయుడు, ఏడీఎంహెచ్‌వో డేవిడ్, తహశీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో యాదగిరేశ్వరావు ఉన్నారు.

దారి దోపిడీ కేసులో ముగ్గురి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకటనారాయణ

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం అద్దంపల్లిలో జరిగిన దారి దోపిడీ కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. రామచంద్రపురం సీఐ కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశంలో వివరాలను సీఐ ఎం.వెంకట నారాయణ వెల్లడించారు. ఈనెల 3న రాత్రి అద్దంపల్లికి చెందిన యండమూరి శ్రీనివాస్ ద్రాక్షారామలో తాను పనిచేస్తున్న నగల దుకాణం మూసివేసి ఇంటికి వెళ్తుండగా అద్దంపల్లి దేవాంగుల శ్మశానవాటిక వద్దకు వచ్చేసరికి ఇద్దరు ఆటోలో వచ్చి ఇనుపపైపుతో కొట్టి కళ్లలో కారం చల్లి సుమారు 10 గ్రాముల బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్, రూ.5వేల నగదు, యాక్టివా మోటారు సైకిల్‌ను దోచుకున్నారు. దీనిపై కె.గంగరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మంగళవారం సాయంత్రం కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం లచ్చిపాలెం ఏరియా బైపాస్‌రోడ్డులో తాళ్లరేవు మండలం గాడిమొగకు చెందిన ఓలేటి సత్తిబాబు, సంగాడిరాజు, మల్లవరం శివారు పత్తిగొందికి చెందిన కళ్లేపల్లి ప్రసాద్‌ను సీఐ వెంకటనారాయణ, సిబ్బంది అరెస్టు చేశారు. వారి నుంచి బంగారు ఆభరణాలు, యాక్టివా మోటారు సైకిల్, దోపిడీకి వినియోగించిన ఆటో, 3 సెల్‌ఫోన్లు, రూ.1000 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఓలేటి సత్తిబాబు చేపల వ్యాపారంచేస్తూ బెట్టింగ్‌లకు బానిసై అప్పుల పాలయ్యాడు. ఎలాగైనా డబ్బు సంపాదించాలని మిగిలిన ఇద్దరితో కలసి దోపిడీకి పాల్పడినట్టు సీఐ పేర్కొన్నారు.

చింతూరు డీఎఫ్‌వోగా రవీంద్రనాథ్‌రెడ్డి

లక్కవరం సబ్ డీఎఫ్‌వోగా శివకుమార్ గంగల్

చింతూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): చింతూరు డీఎఫ్‌వోగా రవీంద్రనాద్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు విడుదల చేసింది. 2016 ఐఎఫ్ఎస్ బ్యాచ్‌కి చెందిన రవీంద్రనాథ్‌రెడ్డి కాకినాడ నుంచి ఇక్కడకు బదిలీపై రానున్నారు. ఇప్పటివరకు చింతూరు డీఎఫ్‌వోగా విధులు నిర్వర్తించిన బబిత డెహ్రాడూన్‌లో శిక్షణ పొందుతున్న నేపథ్యంలో ఈ బదిలీ జరిగింది. అలాగే చింతూరు డివిజన్ పరిధిలోని లక్కవరం రేంజి సబ్ డీఎఫ్‌వోగా శివకుమార్ గంగల్‌ని నియమిస్తూ ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది. 2022 ఐఎఫ్ఎస్ బ్యాచ్‌కు చెందిన శివకుమార్‌గంగల్ ప్రస్తుతం వణ్యప్రాణుల సంరక్షణ విభాగంలో శిక్షణ పొందుతున్నారు. మరికొద్ది రోజుల్లో అధికారులు బాధ్యతలు స్వీకరించనున్నారు.

750 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

తొండంగి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగి మండలం కొమ్మనాపల్లి గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 750 కిలోల బియ్యాన్ని ఎంఎస్‌వో రాజు దాడి జరిపి పట్టుకున్నారు. మంగళవారం ఆయన కొమ్మనాపల్లిలో రేషన్ షాపును సందర్శించి వస్తుండగా రేషన్ బ్యియ్యం మోటార్ సైకిల్‌పై తెస్తున్న నక్కా తాతారావును గమనించారు. అతడిని వెంబడించడంతో ఒక ఇంట్లో కొనుగోలు చేస్తున్న బియ్యాన్ని నిల్వ చేస్తున్నట్టు గుర్తించారు. గదిలో ఉన్న మొత్తం బియ్యాన్ని స్వాధీనం చేసుకుని సమీపంలోని రేషన్ షాపులో అప్పగించారు. కేసు నమోదు చేశారు. ఆయన వెంట వీఆర్వో విజయ్ ఉన్నారు.


స్వాధీనం చేసుకున్న బియ్యంతో ఎంఎస్‌వో

ఐషర్ వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి


సంఘటనా స్థలంలో ఐషర్ వ్యాన్


గంగరాజు (ఫైల్)

ముమ్మిడివరం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మోటారు సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని ఐషర్ వ్యాన్ ఢీకొని పక్క నుంచి ఈడ్చుకుపోవడంతో తీవ్రంగా గాయపడి మృతిచెందాడు. ఈ సంఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాశివానితూము పళ్లవారిపాలెం రోడ్డులో రాజుపాలెం సమీపంలో మంగళవారం జరిగింది. ముమ్మిడివరం మండలం లంకాఫ్ ఠాణేలంక పంచాయతీ పరిధిలోని కూనాలంకకు చెందిన కొప్పిశెట్టి గంగరాజు (45) మోటారు సైకిల్‌పై ముమ్మిడివరం వెళ్తుండగా రాజుపాలెం సమీపంలో అతడి వెనుక కొబ్బరి డొక్కల లోడుతో వస్తున్న ఐషర్ వ్యాన్ గంగరాజును తప్పించబోయి పక్క నుంచి దూసుకుపోవడంతో గంగరాజు తీవ్రంగా గాయపడ్డాడు. వ్యాను కొంతదూరం గంగరాజును ఈడ్చుకుపోవడంతోశరీరం నుజ్జు నుజ్జు అయింది. తీవ్రంగా గాయపడిన అతడిని ఆసుపత్రికి తరలించేందుకు అంబులెన్సులో ఎక్కిస్తుండగా మృతిచెందాడు. గంగరాజు కూరగాయల సాగు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్య రాజేశ్వరి, కుమార్తె ఉన్నారు. ముమ్మిడివరం ఏఎస్ఐ ఆర్.గోపాలకృష్ణమూర్తి కేసు నమోదు చేసి మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబానికిఅప్పగించారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడి మృతి

- మరో ఇద్దరికి గాయాలు
- కపిలేశ్వరపురం మండలం పడమరఖండ్రికలో ప్రమాదం


మరణించిన శ్రీనివాస్

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి చెందిన ఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వపురం మండలం పడమరఖండ్రిక గ్రామంలో మంగళవారం జరిగింది. అంగర పోలీసులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కపిలేశ్వరపురం మండలం టేకి గ్రామానికి చెందిన వాసంశెట్టి శ్రీనివాసు(30) పడమరఖండ్రికలో ఇంటి నిర్మాణ పనులు చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో స్లాబ్ సెంటరింగ్ పనుల కోసం ఇనుక ఊచలను బిల్డింగ్‌పైకి లాగుతుండగా సమీపంలో ఉన్న 11కేవీ విద్యుత్ వైర్లు తగలడంతో శ్రీనివాసు అక్కడికక్కడే మృతిచెందాడు. అక్కడే ఉన్న వి.శ్రీను, జి.శివకృష్ణకు స్వల్పగాయాలు కావడంతో వారిని కపిలేశ్వరపురం పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన చికిత్స కోసం రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. శ్రీనివాసు భార్య కుమారి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మండపేట ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ హరీష్ కుమార్ తెలిపారు. కాగా శ్రీనివాసుకు 8,6 ఏళ్ల వయస్సు కలిగిన ఇద్దరు కుమారులు ఉన్నారు. అతడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

వివాహేతర సంబంధం నేపథ్యంలో వ్యక్తి ఆత్మహత్య

అలస్యంగా వెలుగులోకి ఘటన


సత్య భూషణం (ఫైల్)

కాకినాడ క్రైం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివాహేతర సంబంధం నేపథ్యంలో సెల్ఫీ వీడియో రిలీజ్ చేసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళితే.. కాకినాడ జీజీహెచ్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేసే మామిడిశెట్టి సత్యభూషణం (45)కు భార్య, కుమారుడు ఉన్నారు. అతడు సెల్ఫీ వీడియోలో జరిగిన విషయాన్ని వివరించాడు. అతడు జీజీహెచ్‌లో పనిచేస్తున్న ఓ మహిళతో సహజీవనం చేస్తున్నాడు. వారు ఇంద్రపాలెంలో ఉంటుండగా పక్కనే ఉంటున్న పంపన నాగవీరదుర్గాప్రసాద్ అలియాస్ బుజ్జి మహిళతో పరిచయం పెంచుకున్నాడు. వాళ్లిద్దరి పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ విషయం సత్యభూషణంకు తెలిసింది. అయితే 2 నెలల క్రితం ఆ మహిళను వివాహం చేసుకున్న సత్యభూషణం కాకినాడ కుళాయిచెరువు సమీపంలో ఉన్న మమత అపార్ట్‌మెంట్‌లోకి మారాడు. అయితే బుజ్జి తనతోనే ఉండాలని ఆ మహిళను బెదిరిస్తూ ఒప్పించాడు. ఈనెల 5న బుజ్జి ఆమెతో ఉండడాన్ని చూసి బుజ్జి ఇంటి కెళ్లి సత్యభూషణం ఘర్షణకు దిగాడు. "అయితే రాజకీయ అండదండలతో చంపేస్తానని బెదిరించాడని, నా చావుకు బుజ్జి, ఆ మహిళే కారణం" అని సత్యభూషణం సెల్ఫీ వీడియోను మొదటి భార్య, కుమారుడికి పంపి ఈనెల 6న ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే బుజ్జి పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై అత్యాచారం

కేసు నమోదు

గోకవరం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం జరిగినట్టు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ వీఎస్‌వీ పవన్‌కుమార్ మంగళవారం తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలంలో ఓ గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలికను గోకవరానికి చెందిన మాగపు గాంధీ ప్రేమిస్తున్నానని 3వారాలుగా నమ్మబలికాడు. ఈనెల 8న బాలికను తన తల్లిదండ్రులకు పరిచయం చేస్తానని ఓ ఇంటికి తీసుకెళ్లాడు. ఇంట్లో ఉంచి బిర్యాని తీసుకొచ్చేందుకు బయటకు వెళ్లగా గోకవరానికి చెందిన గునుపే కిరణ్ ఇంట్లోకి చొరబడి తనపై అత్యాచారానికి పాల్పడినట్టు బాలిక ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

టీడీపీ కార్యకర్త కుటుంబానికి చెక్కు అందజేత

పిఠాపురం రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో మరణించిన పిఠాపురం మండలం మంగితుర్తికి చెందిన టీడీపీ కార్యకర్త నీలం భీమరాజు కుటుంబానికి ఆ పార్టీ తరపున బీమా పథకం ద్వారా రూ.5లక్షల చెక్కును మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ మంగళవారం అందజేశారు. ఆయన వెంట టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు సకుమళ్ల గంగాధర్, నాయకులు ఉన్నారు.



ప్రమాదంలో మరణించిన జనసేన క్రియాశీలక సభ్యుని కుటుంబానికి చెక్కు అందజేస్తున్న దృశ్యం

జనసేన సభ్యులకు అండగా పవన్‌కల్యాణ్

పిఠాపురం/గొల్లప్రోలు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాల్లో మరణించిన జనసేన క్రియాశీలక సభ్యుల కుటుంబాలకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అండగా నిలుస్తున్నారని డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు పేర్కొన్నారు. గొల్లప్రోలు పట్టణం, దుర్గాడ, చిత్రాడ గ్రామాల్లో ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన జనసేన కార్యకర్తల కుటుంబాలకు రూ.5లక్షల వంతున పవన్ పంపిన చెక్కులను క్రియాశీలక సభ్యుల ద్వారా మంగళవారం అందజేశారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్, నాయకులు, జన సైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

కరప, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలవ్యాప్తంగా ఉన్న సచివాలయ ఉద్యోగులు మంగళవారం కరప డిప్యూటీ ఎంపీడీవో సలాది వెంకటశ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో పనిభారం అధికమై తీవ్ర ఒత్తిళ్లకు గురవుతున్నామన్నారు. ఇంటింటికీ తిరిగి నిర్వహించే సర్వే, ఇతర పనుల వల్ల పలు అవమానాలు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ లక్ష్యాలకు, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయడానికి సిద్ధంగా ఉన్నామని, అయితే బలవంతపు విధుల నుంచి తమను తప్పించాలని కోరారు. న్యాయబద్ధంగా తమకు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, అన్ని విభాగాల్లో ప్రమోషన్ చానల్స్ ఏర్పాటుచేసి జిల్లాల వారీగా సీనియారిటీ జాబితాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు, డిమాండ్లను 15రోజుల్లోగా పరిష్కరించకపోతే రాష్ట్ర గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిరసన చేపడతామని స్పష్టం చేశారు. మండల సచివాలయ ఉద్యోగుల సంఘ నాయకులు పాల్గొన్నారు.



డిప్యూటీ ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న మండల సచివాలయ ఉద్యోగులు

సామర్లకోట మండలానికి మహర్దశ

రూ.10 కోట్ల నిధులతో ప్రణాళిక... రానున్న రెండేళ్లలో పనుల పూర్తికి సన్నాహాలు: ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట, పెద్దాపురం మండలాల్లోని అన్ని గ్రామాల్లో రోడ్లు, డ్రెన్లు, కల్వర్టుల నిర్మాణానికి రూ.10కోట్ల వ్యయంతో ప్రణాళిక రూపొందించినట్టు పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప వెల్లడించారు. మంగళవారం ఆయన మండల స్థాయి అధికారులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో సమీక్షించారు. రానున్న రెండేళ్లలో ఈ పనులు పూర్తి చేసేందుకు అధికారులకు ఆయా గ్రామాల కూటమి నాయకులు సహకరించాలన్నారు. పెద్దాపురం లేదా సామర్లకోటలో రూ.కోటితో వృద్ధాశ్రమం ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించామని చెప్పారు. మరో వారంలో స్థల కేటాయింపులు పూర్తవుతాయన్నారు. రాష్ట్రంలో మరే నియోజకవర్గంలోనూ లేని రీతిలో పెద్దాపురం నియోజ కవర్గంలోనే పైలట్ ప్రాజెక్టుగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి భువనేశ్వరిని తమ ప్రాజెక్ట్ ప్రణాళికను సందర్శించాలని ఆహ్వానించినట్టు తెలిపారు. దసరాల్లో ఆమె ఇక్కడకు విచ్చేస్తారన్నారు. టీడీపీ నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, పాలకుర్తి శ్రీనుబాబు, తోటకూర శ్రీనివాసు, గుమ్మళ్ళ రామకృష్ణ, బలుసు శ్రీనివాసు, యండమూరి వాసు, ఎండీ సైపుల్లా, గుడాల శంకర్, జనసేన నాయకులు సరోజా వాసు, మంచెం సాయిబాబు, బీజేపీ ఇన్చార్జి వెంకటరమణ పాల్గొన్నారు.

'యూరియాపై వైసీపీ నేతలవి తప్పుడు ఆరోపణలు'



పిఠాపురంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, అన్ని ప్రాంతాల్లో రైతులకు సరిపడా సరఫరా చేస్తుంటే వైసీపీ నేతలు మాత్రం తప్పుడు ఆరోపణలు చేయడమే పనిగా పెట్టుకున్నారని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ విమర్శించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వైసీపీ చేపట్టిన అన్నదాత పోరు, అందులో ఆ పార్టీ నాయకులు చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా కోసం అధిక సంఖ్యలో రైతులు వస్తే క్యూలైన్లు ఉండవా అని ప్రశ్నించారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో లేని యూరియా కొరత పిఠాపురంలో ఉన్నట్టు కాకినాడ మాజీ ఎంపీ గీత దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా యూరియా పంపిణీ: జేసీ

పెద్దాపురం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎటువంటి ఇబ్బందీ తలెత్తకుండా యూరియా పంపిణీ చేస్తామని జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా పేర్కొన్నారు. మండలంలోని కట్టమూరులో రైతు సేవా కేంద్రం వద్ద జరుగుతున్న యూరియా పంపిణీని మంగళవారం ఆయన జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం యూరియా సరఫరా చేస్తోందన్నారు. ఏడీఏ నల్లి దైవకుమార్, ఏవో సంజయ్‌కుమార్, కూటమి నేతలు సానిపిన రామకృష్ణ, గుత్తుల సూర్యావతి, మాదిరెడ్డి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): మండలంలోని అచ్చంపేట గ్రామ పరిధిలో యూరియా ఎరువుల లభ్యత, రైతుల అవసరాలను జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా, జిల్లా వ్యవసాయాధికారి ఎన్.విజయకుమార్ మంగళవారం క్షేత్ర స్థాయిలో పర్యటించి స్వయంగా తెలుసుకున్నారు. మంగళవారం ఉదయం నుంచి 10 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశారని జేసీకి రైతులు వివరించారు. కాకినాడ ఏడీఏ దుర్గాలక్ష్మి, మండల వ్యవసాయాధికారి మురళీధర్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు వీరంరెడ్డి వెంకన్నబాబు, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.





దేవాలయం వీధిలోని బాలాత్రిపురసుందరి దేవస్థానం, సంతచెరువు సెంటర్లోని కనకదుర్గమ్మ ఆలయ పాలకవర్గ సభ్యులతో ఎమ్మెల్యే కొండబాబు

దేవాలయాల అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దేవాలయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. మంగళవారం దేవాలయం వీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి దేవస్థానం పాలకమండలి ప్రమాణస్వీకారోత్సవం జరిగింది. చైర్మన్‌గా పల్ల నారాయణబాబు (సురేష్), సభ్యులుగా కాకి శ్రీనివాసరావు, భమిడిపాటి శ్రీకృష్ణ, కాంతిలాల్ చౌదరి, కోడూరి కుమారస్వామి, బుంగా చిన్న నూకాలమ్మ, లవుడు సత్యవేణి, అరుగుల దేవీప్రసన్న, ఎస్వీఎస్ఎస్ శైలజ ప్రమాణం చేశారు. ఈవో ఆర్.రాజేశ్వరరావు, నాయకులు మల్లిపూడి వీరు, గ్రంధి బాబ్జీ, బచ్చు శేఖర్, దంగేటి సతీష్, యెనిమిరెడ్డి మాలకొండయ్య, గదుల సాయిబాబు, చింతలపూడి రవి, బొబ్బిలి గోవిందు, దవులూరి భద్రరావు, అద్దేపల్లి గంగరాజు, నాగదేవర శ్రీనివాసరావు, పందిరి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సంతచెరువు సెంటర్లోని కనకదుర్గమ్మ ఆలయ పాలకమండలి ప్రమాణస్వీకారోత్సవం ఘనంగా జరిగింది. చైర్మన్‌గా రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, సభ్యులుగా సొల్లేటి వెంకటనాగలక్ష్మి, మల్లాడి వీరబాబు, సత్యంశెట్టి రాజేష్, నేరెళ్ల పల్లవి, ఆకెళ్ల ప్రసాద్, ఓలేటి తులసి, ముత్యాల ప్రకాష్, పట్నాల వీరరాఘవ, వంక మాలతి ప్రమాణం చేశారు. ముఖ్య అతిథిగా కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ప్రత్యేక అతిథిగా డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు విచ్చేశారు. ఆలయ ఈవో రాజేశ్వరరావు, కూటమి నాయకులు మల్లిపూడి వీరు, బంగారు సత్యనారాయణ, పొంగా బుజ్జి, అమలకంటి బలరామ్, రెడ్నం సత్తిబాబు, బచ్చు శేఖర్, తలాటం సత్య, ఆకుల వెంకటరమణ, వీవీ స్వామి తదితరులు పాల్గొన్నారు.





కాకినాడ రూరల్ రమణయ్యపేట ఎంపీడీవో కార్యాలయంలో టీచర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే నానాజీ, సామర్లకోటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజప్ప

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భావితరాల బంగారు భవిష్యత్తును దిశానిర్దేశం చేయడంలో గురువులదే కీలక పాత్ర అని ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. రమణయ్యపేట ఎండీపీవో కార్యాలయంలో ఎంఈవో తమ్మల రంగారావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన గురుపూజోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన ఏపీఎస్పీ హైస్కూల్ హెడ్మాస్టర్ కె.గాయత్రితో పాటు జిల్లా, మండల స్థాయిల్లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన 25 మంది ఉపాధ్యాయులను ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. నియోజకవర్గానికి 35 మోడల్ స్కూల్స్, 3 హైస్కూల్స్ మంజూరైనట్టు చెప్పారు. ఎంఈవో రంగారావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నానాజీని ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఏపీ ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ శిరంగు శ్రీనివాసరావు, ఎంపీపీ అనంతలక్ష్మి, ఎంపీడీవో పసుపులేటి సతీష్, హైస్కూలు ప్లస్ ఇన్‌చార్జి కందుకూరి పాల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): గురువులను మనం గౌరవించాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కోరారు. ఎంపీపీ సత్తిబాబు, జడ్పీటీసీ ఎలిశెట్టి అమృత ఆధ్వర్యంలో ఎంఈవోలు వై.శివరామకృష్ణయ్య, పట్టపగలు పుల్లయ్య నేతృత్వంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా, మండల స్థాయిల్లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న తొమ్మిది మందిని, ఎంఈవోలను ఎమ్మెల్యే సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఇన్చార్జి ఎంపీడీవో భైరవమూర్తి, పాలకుర్తి శ్రీనుబాబు, అడబాల కుమారస్వామి, గుమ్మళ్ళ రామకృష్ణ, బలుసు శ్రీనివాసు, తోటకూర శ్రీనువాసు తదితరులు పాల్గొన్నారు.

చొల్లంగిలో పశువులకు వ్యాక్సిన్లు

తాళ్లరేవు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ గోకుల్ మిషన్ సారధ్యంలో చొల్లంగిలో ఏర్పాటుచేసిన పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని తాళ్లరేవు ఎంపీపీ రాయుడు సునీత మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాక్సిన్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా పశుగణాభివృద్ధి సంఘం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.కాంతారావు, డిప్యూటీ డైరెక్టర్ అంబేడ్కర్ పశువులకు ప్రభుత్వం అందించే వ్యాక్సిన్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. పశు వైద్యులు డి.సుధ, శుభశ్రీ పశువులకు వ్యాక్సిన్లు వేశారు. గర్రే లక్ష్మీనారాయణ, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి'

కాకినాడ సిటీ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): యువతీ, యువకులు మత్తు పదార్థాలు, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని జేసీఐ కాకినాడ పోర్టు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక వివేకాంద పార్కు వద్ద జెండా ఎగురవేసి ర్యాలీని ప్రారంభించారు. యువకులు ప్లకార్డులు పట్టుకుని డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జేసీఐ కాకినాడ పోర్టు శాఖ అధ్యక్షుడు డాక్టర్ తన్మయి రామచంద్ర మాట్లాడుతూ చిన్న వయసులో డ్రగ్స్ జోలికి వెళ్లకుండా భవిష్యత్‌పై దృష్టిసారించాలన్నారు. జేసీఐ వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 15వ తేదీ వరకు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. డ్రగ్స్ సమాచారాన్ని టోల్‌ఫ్రీ నెం. 1972కు తెలియజేయాలన్నారు. జోన్ ప్రెసిడెంట్ ఎ.సంతోష్ కుమార్, చెక్కా భద్రం, దాసరి రవితేజ, ఎస్ఎన్వీ గౌతమ్, రమేష్, ఎంవీఆర్ మోహన్‌కుమార్, జ్యోతి శ్రీధర్, అనిరుధ్ సిస్టల, జేసీఐ సభ్యులు పాల్గొన్నారు.

14న పిఠాపురంలో జిల్లా స్థాయి యోగాసన పోటీలు

పిఠాపురం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, కాకినాడ జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14న పిఠాపురం రథాలపేట సెంటర్లో గల అంబేడ్కర్ భవన్‌లో జిల్లా స్థాయి యోగాసన పోటీలు జరగనున్నాయి. సంబంధిత పోస్టర్లను మంగళవారం పిఠాపురంలో జరిగిన కార్యక్రమంలో విద్యాశాఖాధికారులు, యోగా అసోసియేషన్ ప్రతినిధులు ఆవిష్కరించారు. 8 నుంచి 60 సంవత్సరాల వయసు కలిగిన విద్యార్థినీ, విద్యార్థులు, పురుషులు, మహిళలకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తామని ప్రతినిధులు తెలిపారు. పోటీల్లో పాల్గొనే యోగా అథ్లెట్లు ఆ రోజు ఉదయం 7.30 గంటలకు ప్రాంగణానికి చేరుకోవాలని సూచించారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు 13వ తేదీ సాయంత్రంలోగా 96407 25485 నెంబరును వాట్సాప్ ద్వారా సంప్రదించాలని కోరారు. ఈ పోటీల్లో ప్రతిభ ఆధారంగా అక్టోబరు 25, 26 తేదీల్లో విశాఖపట్టణంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని, అందులో ప్రతిభ చూపిన వారిని గుంటూరు జిల్లా బాపట్లలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పిఠాపురం ఎంఈవోలు జి.శ్యాంబాబు, నారాయణదాసు, జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వనం వీరబాబు, డి.సత్యప్రియ, కోశాధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పోరంబోకు స్థలంలో డ్రైన్ నిర్మాణంపై

ఇరువర్గాల మధ్య వివాదం

తాళ్లరేవు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకరపాలెం సర్వే నం.123, 126 డ్రైన్ పోరంబోకు స్థలంలో అక్రమ నిర్మాణం చేస్తున్న సర్పంచ్ టిల్లపూడి నాగేశ్వరరావు, కుటుంబ సభ్యులను స్థానికులు మంగళవారం అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వివాదం జరిగింది. ఆ స్థలంలో ఇరువర్గాల వారు మోహరించి నిరసన కార్యక్రమాలు చేపట్టారు. వివాదం ముదిరి ఘర్షణ చోటు చేసుకోవడంతో స్థానిక వీఆర్వో చిన్ని సమాచారం మేరకు కోరింగ ఎస్ఐ సత్యనారాయణ, ఎంపీడీవో సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దారు వీరబాబు, ఆర్ఐ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి వల్లీబాబు సంఘటనాస్థలం వద్దకు చేరుకుని నిర్మాణ పనులను నిలిపివేశారు. ఇరువర్గాల వారు తమ వద్ద ఉన్న రికార్డులు, డాక్యుమెంట్లతో బుధవారం తహసీల్దారు కార్యాలయానికి హాజరు కావాలని కోరారు. దీంతో ఇరువర్గాలు ఆందోళన విరమించాయి.

గర్భిణులకు పోషకాహారం

కరప, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ పథకం కింద పలువురు గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సంఘ కాపరి మోహనరావు వర్ధంతిని పురస్కరించుకుని అతని కుటుంబసభ్యులు గర్భిణీలకు ఓఆర్ఎస్ఎల్ ప్యాకెట్లు, పండ్లు, రొట్టెలు అందజేశారు.

మద్యం బెల్ట్‌షాపుల నిరోధానికి చర్యలు ఏవీ!

గొల్లప్రోలు మండల పరిషత్ సమావేశంలో సభ్యుల ఆగ్రహం

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మద్యం బెల్ట్‌షాపులు పెరిగిపోయినా నిరోధానికి చర్యలు తీసుకోవట్లేదని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అరిగెల అచ్చియ్యమ్మ అధ్యక్షతన మంగళవారం జరిగిన మండల పరిషత్ సమావేశంలో బెల్ట్‌షాపులు, నాటుసారా విక్రయాలను సభ్యులు ప్రస్తావించారు. ఎక్సైజ్ ఎస్ఐ విజయకుమార్ మాట్లాడుతుండగా సభ్యులు జోక్యం చేసుకుని గ్రామాల్లో ఎక్కడికక్కడ బెల్టుషాపులు ఏర్పాటు చేశారన్నారు. వీటికి అనుమతులు ఇచ్చారా అని నిలదీశారు. దీనికి ఎస్ఐ స్పందిస్తూ ఇటీవల ఏకే మల్లవరంలో ఒక బెల్ట్‌షాపు నిర్వాహకుడిని అరెస్టు చేశామని తెలిపారు. నాటుసారా విక్రయాలపై చర్యలు తీసుకోవాలని చెందుర్తి, వన్నెపూడి సర్పంచ్‌లు అల్లి పాప నూకరాజు, కందా సుబ్రహ్మణ్యం, దుర్గాడ, వన్నెపూడి ఎంపీటీసీలు ఆకుల వెంకట్రాజు, కందా బాబ్జీ డిమాండ్ చేశారు. మల్లవరంలో ఇటీవల యూరియా రాగా రైతు సేవా కేంద్రం సిబ్బంది పక్కదోవ పట్టించారని ఎంపీపీ తెలిపారు. మండల వ్యవసాయాధికారి కేవీవీ సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దారు సౌజన్య, మండల ఇంజనీరింగ్ అధికారి కృష్ణమోహన్ తమ శాఖల ద్వారా చేపట్టే కార్యక్రమాలను వివరించారు. ఎంపీడీవో కర్రి స్వప్న, వైస్ ఎంపీపీ బత్తిన మంగ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రణభేరి'

కరప, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి 'రణభేరి' పేరుతో ఉద్యమం చేపడుతున్నట్టు యూటీఎఫ్ జిల్లా నాయకులు బి.ప్రసాదరావు, నాగేశ్వరరావు తెలిపారు. కరప మెయిన్ స్కూల్‌లో మంగళవారం జరిగిన యూటీఎఫ్ కార్యవర్గ సమావేశంలో వారు రణభేరి పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. ఈ నెల 25న విజయవాడలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. అంతకు ముందుగా అన్ని జిల్లాల్లో రణభేరి జాతాలు నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ పి.రాజుబాబు, మండల ప్రధాన కార్యదర్శి రమణ, తలాటం శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న కొత్తపల్లి గ్రామస్తులు

'జనావాసాల మధ్య సెల్ టవర్ నిర్మాణం వద్దు'

కొత్తపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జనావాసాల మధ్యలో సెల్ టవర్ నిర్మాణం వద్దంటూ కొత్తపల్లి గ్రామస్తులు మంగళవారం ఆందోళన చేపట్టారు. ముత్యాలమ్మ గుడి సమీపంలో తొలుత చిన్న టవర్ అని చెప్పి ఏకంగా సుమారు నాలుగు సెంట్ల విస్తీర్ణంలో స్తంభాల కోసం గోతులు తవ్వారు. భారీ మెటీరియల్ తరలించడం గమనించి ఎట్టి పరిస్థితుల్లోనూ టవర్ నిర్మాణం చేయరాదని గ్రామస్తులు నిర్వాహకులను హెచ్చరించారు. దీంతో పనులను తాత్కాలికంగా నిలిపివేశారు.

'త్రయీ సాధనతో తాత్విక జ్ఞానం'

పిఠాపురం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ధ్యాన, జ్ఞాన, మంత్ర సాధనలతో కూడిన త్రయీ సాధన అలవర్చుకోవడం ద్వారా తాత్విక జ్ఞానం తెలియజేయబడుతుందని విశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా అన్నారు. పిఠాపురం పట్టణ శివారులోని పీఠం నూతన ఆశ్రమ ప్రాంగణంలో సప్తమ పీఠాధిపతి 120వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ మానవ జీవన మనుగడకు హుస్సేన్ షా రచించిన షాతత్వ గ్రంథం దిక్సూచి వంటిదన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ కనీసం మూడు మొక్కలు నాటాలని సూచించారు. అనంతరం 'మాతృవందనం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కవిశేఖర ఉమర్ ఆలీషా సాహితీ సమితి ద్వారా ఏటా అందిస్తున్న హుస్సేన్‌షా కవి స్మారక సాహితీ పురస్కారాలను ఆంధ్ర విశ్వవిద్యాలయం సంస్కృత విభాగం విశ్రాంత అధిపతి అక్కుభట్ల శర్మ, నాగులాపల్లికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు చింతపల్లి అప్పారావులకు సంయుక్తంగా ప్రకటించారు. వీరికి ఉమర్‌ఆలీషా పురస్కారాలు, నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, మహవీర్ ఇంటర్నేషనల్ ప్రతినిధి కమల్‌బేడ్, పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, ఆకుల రవితేజ, సెంట్రల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'రైతుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి'

కాకినాడ సిటీ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, ప్రభుత్వం తక్షణం స్పందించి వారిని ఆదుకోవాలని కోరుతూ వైసీపీ రాష్ట్రవ్యాప్తంగా తలపెట్టిన 'అన్నదాత పోరు'లో భాగంగా మంగళవారం కాకినాడ ఆర్డీవో కార్యాలయం వద్ద వైసీపీ నేతలు ధర్నా నిర్వహించారు. అక్కడకు కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు వచ్చి వినతిపత్రం స్వీకరించారు. మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, మాజీ ఎంపీ వంగా గీత, నాయకులు బెజవాడ సత్యనారాయణ, పితాని శ్రీనివాసరావు, అల్లి రాజబాబు, సుంకర విద్యాసాగర్, రేకళ్ల సత్యనారాయణ, రాగిరెడ్డి బన్ని, రావు చిన్నారావు, సంగాని నందం, అనుసూరి ప్రభాకర్, సుంకర శివప్రసన్న, జమ్మలమడుగు నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో రైతులు అన్ని రకాలుగా దగాకు గురవుతున్నారని మాజీ మంత్రి, వైసీపీ నేత దాడిశెట్టి రాజా అన్నారు. ఆ పార్టీ పెద్దాపురం నియోజకవర్గ ఇన్చార్జి దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో పట్టణంలో 'అన్నదాత పోరు' నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయ పరిపాలనాధికారి మాధవరావుకు వినతిపత్రం అందజేశారు. వైసీపీ జగ్గంపేట, ప్రత్తిపాడు నియోజకవర్గాల ఇన్చార్జులు తోట నరసింహం, ముద్రగడ గిరిబాబు, నేతలు తోట రాంజీ, నెక్కంటి సాయిప్రసాద్, ఊబా జాన్‌మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

శంఖవరం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రతీ తప్పనిసరిగా తమ పంటను ఈక్రాప్‌లో నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి పి.గాంధీ పేర్కొన్నారు. మంగళవారం కత్తిపూడిలో వరినాట్లను ఆయన సిబ్బందితో పరిశీలించారు. నానో యూరియా, నానో డీఏపీపై రైతులకు అవగాహన ఏర్పరిచారు. స్థానిక దుకాణాల్లో ఎరువుల పంపిణీని పర్యవేక్షించారు. సిబ్బంది జగదీష్, గోవిందరాజు, రజాక్ పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

జనసేన కార్యకర్తల కుటుంబాలకు సాయం అందజేత

ప్రత్తిపాడు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని జనసేన క్రియాశీలక కార్యకర్తలు ఆకస్మికంగా మృతి చెందడంతో వారి కుటుంబాలకు డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ రూ.15లక్షలు ఆర్థిక సహాయం అందజేశారు. పెదశంకర్లపూడిలోని జనసేన క్రియాశీలక సభ్యుడు అంకం సుబ్రహ్మణ్యం మృతిచెందడంతో అతడి కుటుంబ సభ్యులకు మంగళవారం రాత్రి జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, నియోజకవర్గ నాయకుడు మేడిశెట్టి సూర్యకిరణ్, జిల్లా కార్యదర్శి దాసం శేషారావు, లింగంపర్తి సొసైటీ చైర్మన్ పెంటకోట మోహన్, వీర మహిళ దళే జ్యోతి రూ.5లక్షలు అందజేశారు. ఉత్తరకంచిలో జనసేన క్రియాశీలక సభ్యుడు తఱ్ఱా దుర్గాపవన్ మృతి చెందడంతో అతడి కుటుంబానికి రూ.5లక్షలు, శృంగధారకు చెందిన జనసేన క్రియాశీలక సభ్యుడు ఒనుముల శివశంకర్ మృతిచెందడంతో మరో రూ.5లక్షలు పంపిణీ చేశారు. పవన్‌కల్యాణ్‌కు బాధిత కుటుంబీకులు ధన్యవాదాలు తెలిపారు. జనసేన నాయకులు రామకుర్తి కామేష్, సుభాష్, కరణం సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.


పెదశంకర్లపూడిలో అంకం సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న తుమ్మల రామస్వామి, నాయకులు

'మహాసముద్రాలు అంతులేని సంపదకు నిలయాలు'

తునిరూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీప్రకాష్ విద్యా సంస్థల అనుబంధసంస్థ అయిన స్పేసెస్ డిగ్రీ కళాశాల డిపార్ట్మెంట్ ఆఫ్ ఫిజిక్స్ ఆధ్వర్యంలో సముద్ర సాంకేతికత పరిజ్ఞానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ మాజీ డైరెక్టర్ డాక్టర్ గిడుగు రామదాసు హాజరయ్యారు. మహాసముద్రాలు అంతులేని సంపదకు నిలయాలని, వాటిని సద్వినియోగం చేసువాలన్నారు. సముద్రాల నుంచి వచ్చిన అపరిమితమైన వనరులను పొందేందుకు, అధ్యయనం చేసేందుకు ఉపయోగించే పరికరాలు వాటి సాంకేతికతను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్‌డాక్టర్ రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులుపాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రామదాసు

డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం

జగ్గంపేట, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): జగంపేట టౌన్ పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో జనసేన పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ క్యాంటీన్ నిర్వహించారు. తుమ్మలపల్లి హాజరై 500మంది పేదలకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మాదారపు వీరబాబు, కురుమల్ల నాగేశ్వరావు, అంకం ఓం కృష్ణ,పాఠంశెట్టి రమేష్, సత్తి సోమరాజు, డ్రిల్ మాస్టారు, కాయల మణికంత, అడబాల వీరబాబు, శ్రీమన్నారాయణ, కనకరాజు, రేవూరి శ్రీను పాల్గొన్నారు.

సమస్యలపై సచివాలయ ఉద్యోగుల వినతి


వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కోటనందూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): కోటనందూరు మండలం సచివాలయ ఉద్యోగస్తులు మంగళవారం సమస్యలపై ఎంపీడీవో వెంకటనారాయణకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. వలంటీర్ల వలే తమకు అన్ని పనులు అప్పజెప్పడం సరికాదన్నారు. పదోన్నతులు ఇవ్వాలని, టీఏడీవో అలవెన్సులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వినతి ఇచ్చినవారిలో లగుడు శ్రీను, రామచంద్ర, వీరబాబు, శివాజీ తదితరులున్నారు.


ఆదిత్య పోలీవేద 2కే25 పోస్టర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

15, 16న 'ఆదిత్య'లో 2కే25 టెక్ ఫెస్ట్

గండేపల్లి, సెప్టెంబర్ 9(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాలలో ఇంజనీర్స్ డే సందర్భంగా ఈనెల 15, 16న పోలీవేద-2కే25 పేరిట టెక్ ఫెస్ట్ నిర్వహిస్తామని ఆదిత్య కళాశాల వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్‌రెడ్డి తెలిపారు. ఫెస్ట్ పోస్టర్‌ను రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ జీవీ రామ చంద్రరావు విడుదల చేశారు.

గొల్లలగుంట మత్స్య సహకార సంఘం ఎన్నికలు ఏకగ్రీవం

జగ్గంపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గొల్లలకుంట మత్స్య సహకార సంఘం నూతన పాలకవర్గం ఎన్నికలు మంగళవారం జరిగాయి. సంఘం అధ్యక్షుడిగా బత్తిన రామకృష్ణ, కార్యదర్శిగా తలారి పాపారావు, కార్యవర్గ సభ్యులుగా దారా భాస్కరరావు, తలారి చిన్న అప్పారావు, తలారి సత్తిబాబు, ఇజ్జిన ప్రేమానందం, తలారి రాజు, రేగుళ్ల వెంకటరమణ, రేగుళ్ల వీర వెంకటరమణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి తుని ఎఫ్‌డీవో సీహెచ్ ఉమామహేశ్వరరావు పర్యవేక్షణలో ఎన్నికలు జరిగాయి. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిరుమల రాజు మురళిరాజు, కలిదిండి రాజశేఖర్, కె.కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

పనిభారం తగ్గించాలి

శంఖవరం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): పనిభారంతో ఇబ్బందులు పడుతున్నామని తమను మాతృ సంస్థలకు తరలించాలని సచివాలయ ఉద్యోగులు ఎంపీడీవోకు వినతిపత్రం ఇచ్చారు. మంగళవారం ఉద్యోగ సంఘాల నేతలు మండల పరిషత్ ఆవరణలో ఎంపీడీవోకు సమస్యలు తెలిపి ప్రభుత్వానికి నివేదించాలని కోరారు. న్యాయబద్ధమైన తమ డిమాండ్లను పరిష్కరించాలన్నారు.


విరాళం అందజేస్తున్న దృశ్యం

ఆలయ అభివృద్ధికి విరాళం

కిర్లంపూడి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చిల్లంగిలోనున్న అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వరస్వామి, అష్టలక్ష్మీ సమేత లక్ష్మీనారాయణస్వామి ఆలయ అభివృద్ధితో పాటు పలు విగ్రహాల ప్రతిష్ఠకు గొల్లప్రోలు గ్రామానికి చెందిన ముమ్మిడి వీర వెంకట రాజ్యలక్ష్మి రూ.10 లక్షల విరాళాన్ని ఆలయ అభివృద్ధి కమిటీకి అందజేశారు.

ముద్రగడను కలిసి మాజీ ఎమ్మెల్యే వర్మ

కిర్లంపూడి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభాన్ని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ వర్మ మంగళవారం కలిశారు. వర్మకు ముద్రగడ తనయుడు గిరిబాబు సాదరంగా ఆహ్వానం పలికారు. ముద్రగడ ఆరోగ్యంపై వర్మ వారికి అడిగి తెలుసుకున్నారు.

ఐదు తరగతులకు.. ఒకే ఉపాధ్యాయుడు


గవిరంపేటలో ఐదు తరగతులకు పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడు

శంఖవరం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గవిరంపేటలో మండల పరిషత్ పాఠశాలలో ఐదు తరగతులకు 22మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాల తెరిచినప్పటి నుంచి ఒక్క ఉపాధ్యాయుడే పాఠాలు చెప్తున్నారు. ఒకటి నుంచి 5 తరగతులు వరకూ ఉన్నత పాఠశాలలో ఒక్క ఉపాధ్యాయుడే పాఠాలు చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక తరగతికి పాఠాలు చెప్తే మితగా తరగతుల విద్యార్థులు ఖాళీగా ఉండాల్సి రావడం లేదా ఇదివరకే చెప్పిన పాఠాలు చదువుకోవడమో రావాల్సి వస్తుంది. ఉన్న ఒక్క మాస్టారు సెలవు పెడితే వేరే పాఠశాల నుంచి ఉపాధ్యాయుడిని సర్దుబాటు చేయాలి. తమ పాఠశాలకు మరో ఉపాధ్యాయుడిని నియమించాలని విద్యాశాఖాధికారులకు గ్రామస్థులు విన్నవించుకున్నా ఫలితం లేకపోయింది. నూతన నియామకాల్లో మరో ఉపాధ్యాయుడు వస్తారని, దీంతో ఈ పాఠశాలకు ఇబ్బందులు తొలగుతాయని ఎంఈవో సూరిశెట్టి వెంకట తెలిపారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు స్వప్నకు సత్కారం


స్వప్నను సన్మానిస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డు పొందిన వాకపల్లి పాఠశాల ఉపాధ్యాయురాలు బాలూరి స్వప్న స్టాలిన్‌కు మంగళవారం స్థానిక సరయు ఫంక్షన్ హాల్లో ఘన సన్మానం నిర్వహించారు. విద్యాశాఖ, యూటీఎఫ్ శాఖల ఆధ్వర్యంలో స్వప్నను ఎంపీడీవో వి.రాజబాబు, ఎంఈడీవో–2 వై.అచ్చిరాజులు, యూటీఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు కోడి శ్రీనివాస్, సీహెచ్ సూర్యావతి, దొడ్డిపట్ల రాజబాబు, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు వీవీ రమణ, ఏలేశ్వరం గౌరవాధ్యక్షుడు జి.సుందర్రావు, జిల్లా నాయకులు ఆర్.రామలింగేశ్వరరావు, కాకినాడ మెక్లారిన్ విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు డి.సుధాకర్, అనపర్తి శ్యామల సన్మానించారు.

ఆర్టీసీ బస్టాండ్ పరిసరాల అధ్వానం


బస్టాండ్ ఎదుట రహదారిపై బురదనీరు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చినుకుపడితే చిత్తడిగా ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలు అధ్వానంగా మారాయి. వర్షానికి బురద నీరు నిల్వ ఉండి బస్టాండ్ ఎదుట చిన్నపాటి చెరువులా మారింది. ఔట్‌గేట్‌తో పాటు కాంప్లెక్స్ ఎదురుగా ఉండే రిక్షాలు, తోపుడుబండ్ల వ్యాపారాల ప్రదేశాలు మురికినీటి మయంగా మారి అపారిశుధ్యం కలిగిస్తున్నాయి. దీంతో కాంప్లెక్స్‌కు వచ్చే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

'అత్యాచారం కేసులో.. నిందితులను కఠినంగా శిక్షించాలి'

జగ్గంపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గోకవరంలో ఇటీవల 16 ఏళ్ల బాలికపై అత్యాచారం కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని పీడీఎస్‌యూ ఆందోళన చేసింది. గ్రామానికి చెందిన మాగాపు గాంధీ, గునుపే కిరణ్‌ను కఠినంగా శిక్షించాలని వక్తలు డిమాండ్ చేశారు. మంగళవారం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ విజృంభణ) ఆధ్వర్యంలో కృష్ణపాటెం రోడ్డులో వారు ధర్నా చేశారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి సతీష్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదం కేసులో డ్రైవర్‌కు జైలుశిక్ష

గండేపల్లి, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదం కేసులో డ్రైవర్‌కు జైలుశిక్ష పడిందని మంగళవారం జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. 2020 మే 10న గండేపల్లి మండలం మురారి గ్రామ శివారు పోలవరం బ్రిడ్జి వద్ద లారీ డ్రైవర్ హుస్సేన్ లారీని నిర్లక్ష్యంగా నడిపి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్నాడు. ఈ ఘటనలో ప్రయాణికుడు గులివిందల సత్యనారాయణ తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మరణించాడు. దీనిపై అప్పట్లో కేసు నమోదు చేశారు. తదుపరి విచారణ తరువాత లారీ డ్రైవర్ హుస్సేన్‌కు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ దేవి రత్నకుమారి ఆరునెలల జైలుశిక్ష, రూ.1000 జరిమానా విధించారని సీఐ తెలిపారు.

కార్యకర్తలను ఆదుకోవడమే లక్ష్యం

శంఖవరం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలను ఆదుకోవడమే జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ లక్ష్యమని జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్యకిరణ్ అన్నారు. మంగళవారం శృంగధారలో ఇటీవల మృతి చెందిన కార్యకర్త కుటుంబానికి ఇన్సూరెన్సు చెక్కు అందించారు. కార్యక్రమంలో కె.సుబ్రహ్మణ్యం, గాబు సుబాష్, టి.బుజ్జి పాల్గొన్నారు.

వైసీపీ నాయకుల దౌర్జన్యంపై కేసు నమోదు

తునిరూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వల్లూరి గ్రామంలో పంచాయతీ సెక్రటరీపై తుని వైసీపీ నాయకులు దౌర్జన్యానికి దిగడం చర్చనీయాంశంగా మారింది. వైసీపీ రాష్ట్ర మున్సిపల్ వింగ్ జాయింట్ సెక్రటరీ రేలంగి రమణ గౌడ్, అదే పార్టీకి చెందిన మారదాస్ (రవి), కర్రి జగదీష్ వల్లూరు పంచాయితీ సెక్రటరీ వీరబాబు, మహిళా కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడ్డారంటూ అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్ఐ కృష్ణామాచార్యులు తెలిపారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

ఏలేశ్వరం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మండలాధ్యక్షుడు ఏనుగు ధర్మరాజు అన్నారు. మంగళవారం లింగంపర్తిలో కౌలు పట్టాలు అందజేశారు. ప్రభుత్వం అందించే కిసాన్ క్రెడిట్ కార్డు, పీఎం పసల్ బీమా యోజన పథకాలను వినియోగించుకోవాలన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు జ్యోతుల పెదబాబు, లింగంపర్తి సొసైటీ చైర్మన్ పెంటకోట మోహన్, నూకతాటి ఈశ్వరుడు పాల్గొన్నారు.

కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్‌గా చౌదరి



గండేపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్‌గా టీడీపీ గండేపల్లి మండలాధ్యక్షుడు పోతుల వెంకన్న చౌదరి (మోహనరావు) నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఈసందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

బాలల చట్టాలపై శిక్షణ



జగ్గంపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి సంస్థ జగ్గంపేట ఐసీడీస్ ప్రాజెక్ట్ అధికారిణి పూర్ణిమ అధ్యక్షతన గ్రామస్థాయి బాలల సంక్షేమ, పరిరక్షణ కమిటీ అధికారులకు బాలల పరిరక్షణ, బాలల చట్టాలపై శిక్షణ ఇచ్చారు. ముఖ్య అతిథిగా ఎంపీడీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ బాల్య వివాహాలను నిర్మూలించాల్సిన బాధ్యత గ్రామ స్థాయి కమిటీ అధికా రులందరిపై ఉందన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం తెలిస్తే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, ఐసీడీస్ సూపర్ వైజర్లు సునీత, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కోటనందూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్యసమావేశం బుధవారం ఉదయం 10.30గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లగుడు శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం జరగనుంది. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్నిశాఖల అధికారులు విధిగా హాజరుకావాలని ఎంపీడీవో వెంకటనారాయణ తెలిపారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

నిర్వాసితులకు భూమి గుర్తించాలి

● అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

రంపచోడవరం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చింతూరు డివిజన్‌లోని పోలవరం నిర్వాసితులకు రంపచోడవరం డివిజన్‌లో నాలుగు వేల ఎకరాల భూమిని గుర్తించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తహసీల్దార్లను ఆదేశించారు. మంగళవారం స్థానిక పీఎం ఆర్‌సీలో ప్రాంగణంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన సబ్‌కలెక్టర్ శుభం నొక్వాల్‌తో కలిసి పోలవరం ముంపు బాధితులకు భూమికి భూమి, ఆర్అండ్ఆర్ కాలనీల ఏర్పాటుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రంపచోడవరం, అడ్డతీగల, గంగవరం రాజవొమ్మంగి మండలాల్లో సుమారు 4వేలఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించే ప్రక్రియ 15 రోజులలో పూర్తి చేయాలన్నారు. తహసీల్దార్లు సీహెచ్ శ్రీనివాసరావు, ఎన్.దొరడియా, ఏవీ సత్యనారాయణ, బాలాజీ పాల్గొన్నారు.

'గిరిజనేతరుల అక్రమ కట్టడాలను తొలగించాలి'

రంపచోడవరం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న గిరిజనేతరుల అక్రమ కట్టడాలను తక్షణమే తొలగించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నారు. ఈ మేరకు మంగళవారం అల్లూరి సీతారామరాజుజిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్‌ను కలిసి పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. తొలగించిన అక్రమ కట్టడాలకు విద్యుత్ మీటర్లు ఉండడం ద్వారా తొలగించిన చోటే గుడారాలు వేసి వ్యాపారాలు కొనసాగిస్తున్నారని, వాటిని కూడా తొలగించాలని కోరారు. గిరిజనేతరులకు జారీ చేసిన విద్యుత్ మీటర్లను తొలగించాలని కొత్త విద్యుత్ కనెక్షన్లు ఇవ్వొద్దని విజ్ఞప్తి చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రత్యే చట్టాలు ఉన్నప్పటికీ ఉపయోగం లేకుండా పోతున్నాయన్నారు. ఏజెన్సీ చట్టాలకు లోబడి పని చేయని అధికారులపై ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో డివిజన్ కోఆర్డినేటర్ పీతా ప్రసాద్, కడబాల కాసులమ్మ, తీగల రమణమ్మ తదితరులు ఉన్నారు.

అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

అడ్డతీగల, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రిలో అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవలపై నేరుగా వారి దగ్గరికి వెళ్లి తెలుసుకున్నారు. ఆసుపత్రి సిబ్బంది పనితీరు, పారిశుధ్యం, మందుల పంపిణీ, పరీక్షల నిర్వహణ తదితర పరిస్థితులను స్వయంగా పరీక్షించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులందరికీ త్వరితగతిన వారికి కావాల్సిన వైద్య పరీక్షలు సత్వరం చేపట్టాలని ఆదేశించారు. రోగులకు కావాల్సిన అన్నిరకాల మందులు ఆసుపత్రిలోనే ఉచితంగా పంపిణీ చేయాలన్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో గర్భిణులు ఎంతమంది ఉన్నారని తెలుసుకొని వారివద్దకు వెళ్లి వారికి అందుతున్న పోషకాహారం, భోజన ఏర్పాట్లపై ఆరా తీశారు. ప్రస్తుతం జ్వరాల కేసులు, స్కానింగ్ ఆపరేటర్ పనితీరుపై వైద్య అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటి కప్పుడు వివిధ వ్యాధులకు సంబంధించిన మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. తదుపరి ఆసుపత్రి ఆవరణలో కొబ్బరిమొక్కలు నాటారు. పారిశుధ్య కార్యక్రమాలు ఎప్పటికప్పుడు నిర్వహించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట సబ్‌కలెక్టర్ శుభం నోక్వల్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేడ్కర్, డీఎం అండ్ హెచ్‌వో విశ్వేశ్వరనాయుడు, అడిషన్ డీఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

'యూరియా కోసం ఆందోళన అవసరం లేదు'

చింతూరు/మోతుగూడెం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని చింతూరు మండల వ్యవసాయ అధికారిణి రత్నప్రభ పేర్కొన్నారు. మంగళవారం గూడూరు రైతు సేవా కేంద్రంలో రత్నప్రభ రైతులకు యూరియా సరఫరా చేశారు. ఈ సందర్భంగా రత్నప్రభ మాట్లాడారు. ఇప్పటివరకు చింతూరు రైతు సేవా కేంద్రానికి 10 టన్నుల యూరియా, 7 టన్నుల డీఏపీ, ఏడుగురాళ్ళపల్లికి 30 టన్నులు, చదలవాడకు 10 టన్నులు, గూడూరు రైతు భరోసా కేంద్రానికి 25 టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. మండలంలో మొత్తం 11 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయని ఒక్కో రైతు సేవా కేంద్రంలో 20నుంచి 30టన్నుల యూరియా అందుబాటులో ఉంచేందుకు మార్క్‌ఫెడ్‌కు ఇండెంట్ పెట్టామన్నారు. ప్రైవేటు ఎరువుల దుకాణాల్లో నానో యూరియా అందుబాటులో ఉందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రత్నప్రభ కోరారు. ప్రతిరైతు విధిగా ఈ క్రాప్‌లో పంట నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గూడూరు సర్పంచ్ మడివి బొజ్జి, ఎంపీటీసీ మడివి గౌరమ్మ, వ్యవసాయ సహాయకుడు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'యూరియా కొరత తీర్చాలి'

చింతూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతులు యూరియా కోసం నానా అవస్థలు పడుతున్నారని రైతు లందరికీ పంటకు సరిపడా యూరియా సరఫరా చేయాలని ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ డిమాండ్ చేశారు. మంగళవారం చింతూరులో వైసీపీ నేతృత్వంలో అన్నదాత పోరు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అనంత ఉదయభాస్కర్ మాట్లాడారు. ఎరువుల కోసం రైతులు అవస్థలు పడుతుంటే ప్రభుత్వం నిద్ర పోతోందన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల్ని దగా చేసిందన్నారు. కార్యక్రమంలో రంపచోడవరం మాజీ ఎంఎల్ఏ ధనలక్ష్మి, రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలోని వైసీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. చివరిగా తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఐటీడీఏ లో అందజేశారు.

పారదర్శకంగా రేషన్ పంపిణీకే స్మార్ట్ కార్డులు

ఎటపాక, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి) రేషన్‌కార్డుదారులందరికీ పారదర్శకంగా బియ్యం, సరుకులు అందించేందుకే ప్రభుత్వం స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తోందని తహసీల్దార్ కారం సుబ్బారావు పేర్కొన్నారు. మంగళవారం నెల్లిపాక గ్రామంలో ఆయన లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు టీపీవీడు గ్రామంలో తెలుగు యువతరాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు లబ్ధిదారులకు స్మార్ట్‌కార్డులు పంపిణీ చేశారు.

నవోదయలో దరఖాస్తుల స్వీకరణ గడువు పెంపు

ఎటపాక, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎటపాకజవహర్ నవోదయ విద్యాలయంలో 11వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తుల గడువు ఈనెల 15 తేదీ వరకు పొడిగించినట్లు ఇంచార్జ్ ప్రిన్సిపాల్ బీవీ శ్రీనివాసరావు తెలిపారు. నవోదయలో మొత్తం 20 సీట్లు ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. మొదటిగా జిల్లా అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు.

రంపచోడవరం కేంద్రంగా ఆదివాసీ జిల్లాను ఏర్పాటు చేయాలి

రంపచోడవరం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం కేంద్రంగా ప్రత్యేక ఆదివాసీ జిల్లాను ఏర్పాటు చేయాలని కోరుతూ అఖిల భారత రైతు కూలీ సంఘం డివిజన్ కార్యవర్గం ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఐ.వి.రమణ మాట్లాడుతూ పోలవరం, రంపచోడవరం నియోజకవర్గాలను కలుపుతూ ప్రత్యేక జిల్లాను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ ప్రజా సంఘాల ఐక్యవేదిక సభ్యులు కె.బాలురెడ్డి, పి.వీరపురెడ్డి, ఎం.ప్రసాద్‌దొర, కన్నయ్య పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రంపచోడవరం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి తాత్కాలిక ప్రాతిపదికన రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బోటనీ, జువాలజీ సబ్జెక్టులను గెస్ట్ లెక్చరర్లుగా బోధించేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వసుధ తెలిపారు. ఆయా సబ్జెక్టుల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ చేసి 55శాతం మార్కులతో ఉత్తీర్ణత పొంది టీచింగ్ అనుభవం కలిగిన వారు తమ సర్టిఫికెట్లకు జతపరిచి ఈ నెల 15వ తేదీలోగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రాత పరీక్ష ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. నెట్/సెట్/పీహెచ్‌డీ వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఈ నెల 17, 18 తేదీలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు.